
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 13 నవంబరు 2024

గృహనిర్మాణాలను.. డిసెంబర్ చివరికి పూర్తి చేయాల్సిందే

- నిర్మాణం చేపట్టకుంటే ఆర్‌ఆర్ యాక్టు అమలు
- గృహనిర్మాణశాఖ ఈఈ పల్లా వెంకటదాస్



మదనపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణంకోసం అడ్వాన్సుగా డబ్బు తీసుకున్న లబ్ధిదారులు డిసెంబర్ చివరి నాటికి నిర్మాణాలు పూర్తి చేయాల్సిందే అని, లేకుంటే లబ్ధిదారుల నుంచి రెవెన్యూ రికవరీ (ఆర్‌ఆర్) యాక్టు ప్రయోగించాల్సి వస్తుందని గృహనిర్మాణ శాఖ ఈఈ పల్లా వెంకటదాస్ పేర్కొన్నారు. ప్రభుత్వం రెండోవిడతగా విధించిన లక్ష్యాలను పూర్తి చేయించడంలో భాగంగా క్షేత్రస్థాయిలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ నుంచి ఏఈ, డీఈ వరకూ లక్ష్యాలు విధించామని తెలిపారు. గృహనిర్మాణ లక్ష్యాలు, పురోగతిపై ఆంధ్రజ్యోతితో పటాఫట్ ఇంటర్వ్యూ..

పటాఫట్

ప్రశ్న: లక్ష్యాల సాధనకు చేస్తున్న కృషి ఏంటి ?

జవాబు: మదనపల్లె హౌసింగ్ డివిజన్‌లో మదనపల్లె మున్సిపాలిటీ, బి.కొత్తకోట నగర పంచాయతీతో పాటు మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలు, పీలేరులోని వాల్మీకిపురం, కలికిరి మండలాల్లో వర్క్‌ఇన్‌స్పెక్టర్ నుంచి ఏఈ, డీఈ వరకూ టార్గెట్ ఇచ్చాం. వచ్చే డిసెంబరు నాటికి ప్రస్తుతం ఉన్న స్టేజ్‌లను అప్‌గ్రేడ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా గోడలు పూర్తయినవి, మోల్డింగ్ వేసిన ఇంటి స్టేజ్‌పై దృష్టి పెట్టాం.

ప్రశ్న: ఇప్పటి వరకూ సాధించిన లక్ష్యాలు?

జవాబు: డివిజన్‌లో మొత్తం 31,870 గృహాలు మంజూరు కాగా, 16,530 గృహాలు పూర్తయ్యాయి. నిర్మాణాలు ఇప్పటికీ ప్రారంభించని 1,061 గృహాలు రద్దు చేశాం. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. వాటిని కూడా ఒక స్టేజీ నుంచి మరోస్టేజీకి తెచ్చేలా లబ్ధిదారులను ముందుకు నడిపిస్తున్నాం.

ప్రశ్న: మొబలైజేషన్ అడ్వాన్సుల పరిస్థితి

జవాబు: గృహనిర్మాణాలను మరింత ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారులకు ముందుగా రూ.20వేలు మొబలైజేషన్ అడ్వాన్సు ఇచ్చింది. చాలా మంది ఆ డబ్బులను ఇంటినిర్మాణానికి కాకుండా ఇతర అవసరాలకు వాడుకున్నట్లు మా దృష్టికి వచ్చింది. అలాంటి వారి చేత నిర్మాణాలు చేపట్టే ప్రయత్నం చేస్తున్నాం. వీటితో పాటు స్వయం సహాయక సంఘాల్లో ఇప్పటికే రెండు విడతలుగా రూ.35వేలు, రూ.30వేలు చొప్పున రుణం ఇప్పించి, నిర్మాణాలకు అవకాశం కల్పిస్తున్నాం. అడ్వాన్సులు తీసుకున్న లబ్ధిదారులు పనులు చేయకుంటే వారిపై ఆర్‌ఆర్ యాక్టు ప్రయోగిస్తాం.

ప్రశ్న: ఎంతమందికి అడ్వాన్సులు ఇచ్చారు?

జవాబు: డివిజన్‌లో 3,071 మందికి రూ.5.19కోట్లు అడ్వాన్సుగా ఇచ్చాం. అందులో 1,720 మంది చేత నిర్మాణంలో భాగంగా ఇప్పటి వరకూ స్టేజీ కన్వర్షన్ చేయించి రూ.2.79 కోట్లు విలువ చేసే పనులు చేయించాం. మిగిలిన 1,351 మంది చేత కూడా రూ.2.11కోట్ల విలువ పనులు చేసేలా ఒత్తిడి తేవడంతో పాటు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: ఇలాంటి వారికి కొత్త ప్రభుత్వంలో అవకాశం ఉందా?

జవాబు: ఇప్పటి వరకూ పక్కా ఇల్లు మంజూరై, ఒక బిల్లు తీసుకుని నిర్మాణాన్ని ఆపేసినా, అడ్వాన్సుగా రూ.20వేలు తీసుకుని పనులు చేయకున్నా.. కూటమి ప్రభుత్వంలో కొత్త పథకంలో వారికి అవకాశం ఉండదు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి మాత్రమే వీలుంటుంది.

ప్రశ్న: యూనిట్ విలువ పెంచుతారా?

జవాబు: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పక్కా ఇంటి యూనిట్ విలువ రూ.1.80లక్షల నుంచి రూ.4లక్షల వరకూ పెంచే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే ఎంత పెంచేది వారంలో విడుదలయ్యే గైడ్‌లైన్స్‌లో తెలుస్తుంది.

ప్రశ్న: లబ్ధిదారులకు మీరిచ్చే సలహా ఏంటి?

జవాబు: ఇప్పటికే మంజూరైన ఇంటిని యూనిట్ విలువతో సంబంధం లేకుండా పూర్తి చేసుకోవాల్సిందే. వీరికి కొత్త పథకంలో ఎలాగూ అవకాశం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రెండు చోట్లా పోగొట్టుకోవడం కంటే ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

ప్రశ్న: బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్నారా?

జవాబు: స్టేజీ కన్వర్షన్ పూర్తి చేసి బిల్లు పెట్టిన వారంపదిరోజుల్లోనే లబ్ధిదారుల ఖాతాకు డబ్బులు జమ అవుతోంది. ముందులాగా నెలా, రెండు నెలలు నిరీక్షించే పరిస్థితి లేదు. అలాగే నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న సిమెంటు, స్టీలు కూడా అందుబాటులో ఉంది.

ప్రభుత్వ విప్‌గా ఎమ్మెల్యే శ్రీధర్



రైల్వేకోడూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు విప్ పదవి వరించింది. మంగళవారం జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ మేరకు అధికారికంగా ప్రకటించారు. మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికై శాసనసభలో అడుగుపెట్టిన అరవ శ్రీధర్‌కు విప్ పదవి రావడంతో కోడూరులో జనసేన నాయకులు సంబరాలు చేసుకున్నారు.

మణిమకుటం.. 'సీతారాం'

- అప్పటి అద్భుతం గోపురం..
- మరపురాని మధుర స్మృతులెన్నెన్నో
- అలరించిన టెంటు, థియేటర్లు..కనుమరుగు
- నెమరేసుకుంటున్న స్థానికులు

6

చంపేస్తారా సారూ..




6

- విద్యార్థిని చితకబాదిన టీచర్
- లేచి నడవలేకపోతున్న విద్యార్థి
- వళ్లంతా గుల్లచేశాడు : తల్లి

విద్యార్థి ఎడమ కాలిపై గాయాలు

జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలో గత వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన జగనన్న కాలనీల పరిస్థితి ఆరంభ సూరత్వం.. నిర్మాణంలో అలసత్వం అన్న చందంగా తయారైంది. జగనన్న కాలనీలు ఎక్కడ పడితే అక్కడ ఇవ్వడం.. నిర్మాణానికి అనువుగా లేకపోవడంతో చాలా మంది లబ్ధిదారులు అక్కడ ఇళ్లు నిర్మించుకునేందుకు మొగ్గు చూపడం లేదు. రాయచోటి పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా 27 జగనన్న కాలనీల్లో 7200కు పైగా ఇంటి పట్టాలు ఇచ్చినప్పటికీ అందులో కేవలం 1200 గృహాలు మాత్రమే పూర్తి కావడం చూస్తే అధికారుల అలసత్వానికి అద్దం పడుతోంది.



రాయచోటి మండలం గరుగుపల్లి జగనన్న కాలనీలో దర్శనమిస్తున్న పునాదులు

ఇచ్చింది 7200.. పూర్తయింది 1200..!

- ఇంకా పూర్తికాని ఇళ్లు 6 వేలు
- జగనన్న కాలనీల్లో వెంటాడుతున్న సమస్యలు
- పట్టించుకోని గృహ నిర్మాణశాఖ అధికారులు

రాయచోటిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీకి సంబంధించి పట్టణ పరిధిలోని నారాయణరెడ్డిగారిపల్లెకు సమీపంలో సుమారు 5671 ఇంటి పట్టాలను రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ అధికారులు లబ్ధిదారులకు కేటాయించారు. అలాగే వీధులు కూడా విశాలంగా ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలో 5671 గృహాలకు గానూ ఇప్పటి వరకు 845 మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇవేకాకుండా 127 ఇళ్లు స్లాబ్ లెవల్‌లో ఉండగా, 213 గోడలు పూర్తికాగా, 55 సగం గోడల వరకు జరిగాయి. అలాగే 3411 గృహాలు పునాదులకే పరిమితం కాగా 1012 గృహాలను ఇంతవరకు నిర్మాణాలు మొదలే పెట్టలేదంటే రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఇదిలా ఉండగా చాలా మందికి రాయచోటి పట్టణంలో సొంత గృహాలు ఉన్న వారికే నారాయణరెడ్డిగారిపల్లె సమీపంలోని జగనన్న కాలనీలో గత వైసీపీ ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. సొంత గృహాలు ఉండి అక్రమంగా ఇంటి పట్టాలు పొందిన వారి స్థలాలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని అర్హులకు పట్టాలను ఇవ్వాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉండగా రాయచోటి రూరల్ పరిధిలోని 9 గ్రామ పంచాయతీల్లో గత వైసీపీ ప్రభుత్వం 26 జగనన్న కాలనీలో 1795 ఇంటి పట్టాలను లబ్ధిదారులకు అందజేసింది. అందులో ఇప్పటి వరకు 383 నిర్మాణాలు పూర్తి కాగా 47 స్లాబ్ వరకు వచ్చి ఆగిపోయాయి. 96 గోడల వరకు పూర్తయ్యాయి. ఇంకా 17 గృహాలు సగం గోడలతో ఆగిపోగా 1091 గృహాలు పునాదులకే పరిమితమయ్యాయి. అయితే ఇంకా 161 గృహాలు పూర్తి స్థాయిలో మొదలు పెట్టకపోవడం గమనార్హం.



గరుగుపల్లె జగనన్న కాలనీలో పూర్తయిన ఒకే ఒక ఇల్లు



గరుగుపల్లె జగనన్న కాలనీలో చుక్కనీరు లేక నిరుపయోగంగా ఉన్న నీటి పథకం బోరు

సౌకర్యాలు కల్పించకపోవడంతోనేనా..!

గత వైసీపీ ప్రభుత్వం ఊర్లకు ఊర్లు కట్టిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుని ప్రజలకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించకపోవడంతో నేటికీ ఆ కాలనీల్లో పునాదులు దర్శనమిస్తున్నాయి. రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలో చాలా చోట్ల జగనన్న కాలనీల స్థలాలు, గుట్టలు, వాగులు, వంకలు ఉండే ప్రదేశాల్లో ఇంటి పట్టాలు ఇవ్వడం వలన ప్రజలు అక్కడికి వెళ్లి నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రాలేదు. అంతేగాక గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సిమెంటు, కడ్డీలు, ఇసుక ధరలు ఆకాశాన్ని అంటడమే కాకుండా ఎక్కడా ఇసుక దొరక్క పోవడంతో సామాన్యులు ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. అందుకే రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలోని జగనన్న కాలనీల్లో ఎక్కడా నిర్మాణాలు పూర్తి స్థాయిలో జరగలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా ఆయా హౌసింగ్ కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి ఆగిపోయిన నిర్మాణాలను పూర్తి చేసి ఇవ్వాలని పలువురు లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.20 లక్షల హౌసింగ్ నిధులు గోల్‌మాల్

రాయచోటి మండల పరిధిలోని పెమ్మాడపల్లి గ్రామం గరుగుపల్లెకు సమీపంలో గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన జగనన్న కాలనీలో పునాదులు వేసిన చాలా మంది లబ్ధిదారుల నగదు సుమారు రూ.20 లక్షలకు పైగా బినామీల ఖాతాల్లో జమ అయినట్లు తెలుస్తోంది. సుమారు వందకు పైగా లబ్ధిదారులకు ఇంటి పట్టాలు మంజూరు చేయగా కేవలం ఒకే ఒక ఇల్లు మాత్రమే నిర్మాణం జరిగింది. ఇదిలా ఉండగా ఆ కాలనీకి చెందిన సుమారు 13 మంది లబ్ధిదారులకు చెందిన ఖాతాల్లో కాకుండా ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌కు అనుకూలంగా ఉన్న వ్యక్తుల పేర్లతో హౌసింగ్‌శాఖ నుంచి నగదు జమ అయినట్లు సమాచారం. ఒక్కో ఖాతాలో రూ.1.70 లక్షల నుంచి రూ.1.50 లక్షలు, రూ.70 వేలు, రూ.50 వేలు ఇలా పలు రకాలుగా నగదు జమ అయి నట్లు తెలిసింది. అయితే గరుగుపల్లి హౌసింగ్‌కాలనీలోని లబ్ధిదారులు తమ నగదు తమ ఖాతాల్లో పడలేదని, బినామీల పేర్లతో హౌసింగ్ అధికారులు, వైసీపీ నేతలు కుమ్మక్కై జమ చేసుకున్నారని ఆరోపిస్తున్నారు.

అన్నీ కొనుక్కోవాల్సిందే

- ఈ.రెడ్డెమ్మ, లబ్ధిదారురాలు, గరుగుపల్లి



గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన జగనన్న కాలనీలో అప్పటి ప్రభుత్వం గానీ, అధికారులు గానీ ఎటువంటి మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇసుక, మట్టి, నీళ్ల కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఒక్క నీళ్ల ట్యాంకర్ రూ.600కు కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్నాం. మా బాధలు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

- రాంమోహన్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ, రాయచోటిరూరల్

జగనన్న కాలనీలో లబ్ధిదారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నాం. సిమెంటు, కడ్డీలు, హౌసింగ్‌శాఖ ద్వారానే ఇస్తున్నాం. అన్ని కాలనీల్లో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాం. బోర్లు ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కూడా అందిస్తున్నాం. ఎప్పటికప్పుడు లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేస్తున్నాం. ఇక హౌసింగ్ నిధులు గోల్‌మాల్ అయ్యాయని వస్తున్న ఆరోపణలపై విచారిస్తున్నాం.

పనులు చేయకుంటే ఉపేక్షించేది లేదు : కలెక్టర్

ఓబులవారిపల్లె/ పుల్లపేంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పనులు చేయకుంటే ఉపేక్షించేది లేదని, భూ సమస్యలపట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ చామకూరి శ్రీధర్ హెచ్చరించారు. మంగళవారం ఓబులవారిపల్లె, పుల్లంపేట ఎంపీడీవో కార్యాలయాల్లో వేర్వేరుగా మండల అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని రెవెన్యూ, ఎంపీడీవో అలాగే పలువురు అధికారులతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో వారి వారి పనుల పురోగతిపై చర్చించారు. ముఖ్యంగా రెవెన్యూశాఖకు సంబంధించిన భూ సమస్యలు, కొలతలు, సబ్‌డివిజన్లపై వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. భూమి సరిహద్దు రాళ్లపై ఎటువంటి నాయకుల చిత్రాలు ఉండరాదని, వెంటనే తొలగించాలని తెలిపారు. ప్రజలకు అందాల్సిన సేవల్లో అలసత్వం వద్దన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. అర్జీదారులు ఇచ్చిన సమస్యలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. విద్యార్థుల అపార్ ఐడీల జనరేషన్, ఎన్టీఆర్ ఇళ్ల జియోట్యాగింగ్‌లను అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. పెండింగ్ పనులు ఉన్న లబ్ధిదారులతో మాట్లాడి గృహనిర్మాణాలను పూర్తి చేయాలని సూచనలు ఇచ్చారు. అవసరమైన లబ్ధిదారులకు రుణ సదుపాయం కల్పించాలన్నారు.

అనంతరం పుల్లంపేట మండల పరిధిలోని దేవసముద్రం గ్రామంలో భూ సమస్యపై కలెక్టర్ స్వయంగా క్షేత్ర పర్యటన చేసి అధికారులకు తగు సూచనలు అందించారు. రెడ్డిపల్లెలో పంచాయతీ నిధుల దుర్వినియోగంపై టీడీపీ నేతలు రొంపిచెర్ల మురళి, వార్డుమెంబరు శ్రీనివాసులు ఫిర్యాదు చేయడంతో దానిపై విచారణకు ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద సర్వేరాళ్లపై ఉన్న జగననన్న భూరక్ష 2020 రాతలను ఎలా తొలగించాలో కలెక్టర్ ఎదుట అధికారుల సమక్షంలో చూపించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఇన్‌చార్జి ఆర్డీవో లీలారాణి, సర్వే ఏడీ భరత్, పుల్లంపేట తహశీల్దారు అరవింద్‌కిషోర్, ఎంపీడీవో జయశ్రీ ఓబులవారిపల్లె తహశీల్దారు శ్రీధర్‌రావు, ఎంపీడీవో మల్‌రెడ్డి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



పుల్లంపేట ఎంపీడీవో కార్యాలయంలో సర్వేరాళ్లపై జగనన్న భూరక్ష 2020 అక్షరాలను చెరిపివేయిస్తున్న కలెక్టర్

విజ్ఞతతో వ్యవహరించండి



- విద్వేషాలు సృష్టించే పోస్టులు పెట్టవద్దు
- సోషల్ మీడియా అకౌంట్స్, పోస్టులను పర్యవేక్షించేందుకు..
- జిల్లాస్థాయిలో ప్రత్యేక బృందం
- ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, టెలిగ్రాం తదితర సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేటప్పుడు విజ్ఞతతో వ్యవహరించాలని ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్గాల మధ్య విద్వేషాలు రగిల్చే విధంగా వ్యక్తిగత ఫొటోలు మార్ఫింగ్ చేసినా, మానాభిమానాలు దెబ్బతినే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, మతపరమైన సున్నిత అంశాల్లో అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించినా.. కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అసభ్యకరమైన పోస్టులు పెట్టే వారిపై సైబర్ సెల్ మీడియా విభాగంలో ప్రత్యేక నిఘా ఉంచామని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని తెలిపారు. అవాస్తవ ప్రచారాలను ప్రజలు ఎవరూ నమ్మవద్దని సూచించారు. ఫేక్ న్యూస్ వ్యాప్తి లేదా ఫార్వర్డ్ చేసే వారిపై నిఘా ఉంచామని, నిజానిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్టు చేసే వారిపై, షేర్ చేసేవారిపై సంబంధిత గ్రూప్ అడ్మిన్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనాలోచితంగా పోస్టులు పెట్టడం వల్ల జరిగే కీడును గుర్తించాలని సూచించారు. కులమతాల మధ్య విద్వేషాలు సృష్టించే పోస్టులు పెట్టవద్దని తెలిపారు. వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతీసే విధంగా, పార్టీల మధ్య చిచ్చులు పెట్టే పోస్టులు, మహిళలు చిన్నారుల పట్ల అసభ్యకర, అభ్యంతరకర పోస్టులు పెడితే సహించమని తెలిపారు. సోషల్ మీడియా అకౌంట్స్, పోస్టులు పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సాంకేతిక పరిజ్ఞానంలో సుశిక్షితులైన సీఐ, సిబ్బందితో నిరంతర నిఘా ఉంచామని తెలిపారు. విద్వేషాలు రెచ్చగొడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపైనా, వారిని ప్రోత్సహించే వారిపైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఈ సందర్భంగా నెటిజన్లను హెచ్చరించారు.

పెద్దదర్గా ఉరుసును విశ్వవ్యాప్తం చేయాలి

- రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి హర్షవర్ధన్

కడప కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడప ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేలా అమీన్‌పీర్ దర్గా (పెద్దదర్గా) ఉరుసు మహోత్సవాలను నిర్వహించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి హర్షవర్ధన్ దర్గా ఉత్సవ కమిటీ సభ్యులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అమీన్‌పీర్ దర్గా ఉరుసు మహోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధ్యక్షతన ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం జరిగింది. కలెక్టర్‌తో పాటు జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో జాన్ ఇర్విన్, నగర కమిషనర్ మనోజ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ ఉరుసు ఉత్సవాల ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రెవెన్యూ సంబంధిత శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లను పూర్తిచేసి ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. తదనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ చేలా కార్యక్రమంతో ఉరుసు ఉత్సవాలను నాంది పలికామన్నారు. ఉరుసు మహోత్సవాలు 11వ తేదీ నుంచి 21 వరకూ కన్నుల పండువగా జరుగనున్నాయన్నారు. ప్రధానంగా 16, 17 తేదీలలో జరిగే గంధం, ఉరుసు ఉత్సవ ఘట్టాలకు లక్షలాది మంది భక్తులు, వీఐపీలు హాజరవుతారన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. రైల్వేస్టేషన్, బస్ స్టేషన్, దర్గా వరకూ నగరంలోని అన్ని రూట్లను కవర్‌చేస్తూ నిరంతరాయంగా బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించారు. కార్యక్రమంలో పెద్దదర్గా మేనేజర్ మహ్మద్ అలీఖాన్, డీఎంహెచ్‌ఓ నాగరాజు, ఫైర్ అధికారి ధర్మారావు, ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఇమ్రాన్, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, దర్గా మత పెద్దలు పాల్గొన్నారు.



సమీక్షలో ప్రసంగిస్తున్న హర్షవర్ధన్

సారాను పూర్తిస్థాయిలో అరికట్టాలి

- బెల్టుషాపు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరించాలి
- డిప్యూటీ కమిషనరు జయరాజ్

కడప క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడ కూడా సారా తయారీ, విక్రయాలు జరగకూడదని, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని డిప్యూటీ కమిషనర్ జయరాజ్ సిబ్బందిని ఆదేశించారు. కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఎక్సైజ్ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం షాపు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఈ నెల 15లోగా ఒరిజినల్ లైసెన్సు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లకు విక్రయాలు జరిపితే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఏఐఎస్ వినోద్‌కుమార్ నాయక్, ఉమ్మడి జిల్లాల సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జిల్లా సహకారశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో 71వ అఖిల భారత సహకార వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ 14 నుంచి 20 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ఎంతో ఉందన్నారు. 14న సహకార సంఘాల బలోపేతానికి సహకార మంత్రిత్వశాఖ అమలు చేస్తున్న కొత్త కార్యక్రమాలు, 15న నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన, 16న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర, 17న సహకార సంఘాలు వ్యాపార ప్రయోజక సంస్థలుగా రూపాంతరం చెందే కార్యక్రమాలు, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించే కార్యక్రమాలు, 19న మహిళలు, యువత, బలహీన వర్గాల సంక్షేమంలో సహకార సంఘాలు, 20న సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనలో, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకారశాఖ అధికారి గురుప్రకాశ్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటికే పోస్టల్ సేవలు : ఎస్పీ లక్ష్మణ్

రూ. 300కే ఖాతా ప్రారంభం

సంక్షేమ పథకాల లావాదేవీలు పోస్టాఫీసుల్లోనే



ఎంపీడీఓతో మాట్లాడుతున్న పోస్టల్ అధికారి లక్ష్మణ్

పెద్దతిప్పసముద్రం నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసుల ద్వారా ప్రజలు ఖాతాలు తెరిస్తే సంక్షేమ పథకాల లావాదేవీలు డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాలకే నేరుగా అందుతాయని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ (ఎస్పీ), బి. లక్ష్మణ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం అజాద్‌తో భేటీ అయి పోస్టాఫీసుల్లో ఖాతాలను తెరిచేందుకు సచివాలయ ఉద్యోగులు సహకరించాలని కోరారు. గ్రామీణ తపాలా బ్రాంచుల్లో ప్రజలు ఆధార్ కార్డుతో ఖాతాను ప్రారంభిస్తే సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల పోస్టాఫీస్ ఖాతాల్లో పడతాయన్నారు. బ్యాంకులు అందుబాటులో లేని గ్రామాల్లో సైతం గ్రామీణులకు ఉపయోగం ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే రైతుభరోసా, ఉపాధిహామీ, పెన్షన్ ప్రభుత్వం అందించే పథకాల లావాదేవీని ప్రతి ఖాతాదారుడు ఇంటిచెంతనే లబ్ధి పొందే అవకాశాలు ఉంటాయన్నారు. లబ్ధిదారులు సచివాలయాల పరిధిలోనూ ఆధార్ కార్డుతో రూ. 300 చెల్లించి ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ పేమెంట్ (ఐపీబీపీ) ద్వారా ఖాతాను ప్రారంభించవచ్చన్నారు. అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో సుమారు 470 తపాలా బ్రాంచీలు ఉన్నాయని అందులో తాము 2లక్షల 70 వేల ఖాతాలు చేయాలనే లక్ష్యంతో తమ సిబ్బంది పని చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఖాతాలను ప్రారంభించామని నెలాఖరులోపు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సచివాలయ ఉద్యోగులు, మండల అధికారులు సహకరించాలన్నారు. మాఖాతాలకు ఫోన్ పే, గూగుల్ పే కూడా అనుసంధానం చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్, నీలిమ, పీటీఎం పోస్టాఫీసు ఎస్పీఎం రాజారెడ్డి, గ్రామీణ తపాలా ఉద్యోగుల యూనియన్ సెక్రటరీ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

ప్రయాణికులకు తప్పని అవస్థలు

ములకలచెరువు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మీదుగా నడిచే రైళ్లు మంగళవారం ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. నరసాపురం నుంచి ములకలచెరువు మీదుగా ధర్మవరం జంక్షన్‌కు నడిచే ధర్మవరం ఎక్స్‌ప్రెస్ సాంకేతిక కారణాలతో రెండున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడిచింది. ఈ రైలు పీలేరుకు తెల్లవారుజామున 5.39 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 7.54కు, కలికిరికి తెల్లవారుజామున 5.54 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 8.14 గంటలకు, మదనపల్లె రోడ్‌కు ఉదయం 6.19కి రావాల్సి ఉండగా ఉదయం 8.44కు, ములకలచెరువుకు ఉదయం 6.49కి రావాల్సి ఉండగా 9.30 గంటలకు వచ్చింది. రైలు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరుపతి నుంచి గుంతకల్లు జంక్షన్‌కు రోజూ ఉదయం నడిచే ప్యాసింజర్ రైలు ములకలచెరువుకు ఉదయం 10.39 గంటలకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 12.12 గంటలకు వచ్చింది. గుంతకల్లు జంక్షన్ నుంచి తిరుపతికి నడిచే మరో ప్యాసింజర్ రైలు ములకలచెరువుకు ఉదయం 10.49 గంటలకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 12.17 గంటలకు వచ్చింది.

ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న సదరున్నీసా



సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న సదరున్నీసా

రైల్వేకోడూరు, నవంబరు 12:(ఆంధ్రజ్యోతి) అనంతరాజుపేట ఉద్యాన కళాశాల కూరగాయల విభాగాధిపతి సయ్యద్ సదరున్నీసా సోమవారం విజయవాడలో నిర్వహించిన విద్యా దినోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్నట్లు మంగళవారం ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్ తెలిపారు. 20 ఏళ్లుగా ఆమె చేసిన సేవకు గుర్తింపు లభించిందని ఆయన తెలిపారు. తోటి అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రెడ్డి మోక్షిత్ మృతిపై పౌరహక్కుల సంఘం విచారణ



ఉపాధ్యాయులను విచారిస్తున్న దృశ్యం

పీలేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్యారంపల్లె గురుకులంలో రెడ్డి మోక్షిత్ ఉదంతంపై ఉమ్మడి కడప జిల్లా పౌరహక్కుల సంఘం నేతలు మంగళవారం విచారణ చేపట్టారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు నేతృత్వంలోని బృందం గ్యారంపల్లె గురుకులం, పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి, కేవీపల్లె పోలీసులు, రెడ్డి మోక్షిత్ తల్లిదండ్రులను విచారించింది. ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రవిశంకర్ మాట్లాడుతూ మోక్షిత్ మరణంపై అతని తల్లి అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. తమ విచారణలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలిందని, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతోనే మోక్షిత్ మృతి చెందాడన్నారు. అనుమానాలను పోలీసులు నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నేతలు రెడ్డయ్య, వంగిమళ్ల రమణయ్య పాల్గొన్నారు.

కాలుజారి బావిలో పడి యువకుడు మృతి



వెంకటేశు మృతదేహం

లక్కిరెడ్డిపల్లె,నవంబరు12(ఆంధ్రజ్యోతి): కస్తూరిరాజుగారిపల్లె పంచాయతీ గురయ్యగారిపల్లె యువకుడు వెంకటేశు(28) ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. మృతుడి తల్లి వివరాల మేరకు... వెంకటేశు బెంగళూరులో ఉండేవాడు. సోమవారం బెంగళూరు నుంచి గ్రామానికి వచ్చాడు. మంగళవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లి ఎంతసేపటికీ రాకపోవడంతో మృతుడి తల్లి పొలం వద్దకు వెళ్లి చూడగా బావిలో శవమై తేలాడు. స్థానికులు శవాన్ని బయటకు తీసి పోస్టు మార్టం కోసం స్థానిక ప్రభుత్వ తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మణిమకుటం 'సీతారాం'



సీతారాం థియేటర్ భవనం

● అప్పటి అద్భుతం గోపురం..
● మరపురాని మధుర స్మృతులెన్నెన్నో
● అలరించిన టెంటు, థియేటర్లు..కనుమరుగు
● నెమరేసుకుంటున్న స్థానికులు

వాల్మీకిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాటి ప్రజలకు కాలక్షేపం నాటకాలు, తోలుబొమ్మలాట, సినిమా, థియేటర్లు. 1958 డిసెంబరు 30న మొర్రంరెడ్డి నిర్మించిన సినిమా థియేటర్ సీతారాం జిల్లాకే మణిమకుటం. అప్పట్లో సినిమా ప్రొజెక్టర్, సౌండ్ సిస్టం, లైటింగ్ ఎఫెక్ట్ జపాన్ టెక్నాలజీ ఉపయోగించారు. థియేటర్ పునాది మొదలు థియేటర్ ప్రారంభం వరకు అప్పటి కడప కలెక్టర్ మేజర్ పీవీ రత్నం ద్వారా ప్రారంభించారు. 1962లో సీతారాం థియేటర్ తెరపై మొదటి సినిమా ప్రదర్శితమైంది. కొత్త సినిమా వచ్చిందంటే వీధి వీధంతా పండుగను తలపించేంది. వీధిలో మూడు రోడ్లు కలిసే ప్రాంతం కిటకిటలాడే జనంతో ఈలలు, కేకలతో నిండిపోయేది. కాలక్రమేణా జీవన వేగంలో మార్పురావడం, మదనపల్లెలో కొత్త థియేటర్ల నిర్మాణం, ఏసీ థియేటర్లతో కొత్త సినిమాల క్రేజీతో ప్రజలు మదనపల్లెకు వెళ్లి సినిమాలు చూడడం మొదలైంది. దీంతో 2008 ఫిబ్రవరి2వ తేదీన మహాయాగం, అన్నదానం, చేసి ప్రజలకు జీవితచక్రం, బండరాముడు, శ్రీకృష్ణలీల సినిమాలను ఉచితంగా ప్రదర్శించి సీతారాం సినిమా థియేటర్‌కు తెరదించేశారు. మరో సినిమా థియేటర్ సీపీ మహల్ కూడా ఇంతటి అనుభూతిని మిగిల్చినా 2009లో సినిమా థియేటర్ మూతపడింది. అప్పట్లో ప్రజలను అలరించిన సీతారాం థియేటర్ ప్రస్తుతం భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే పాఠశాలగా రూపాంతరం చెందగా మరోథియేటర్ సీపీ మహల్ రూపురేఖలు మార్చి కల్యాణ మండపంలా మారిపోయింది. ఎంతో గొప్ప గుర్తింపు ఉన్న సీతారాం థియేటర్ విషయాలను గుర్తు చేసుకోవాల్సిందే. వివరాల్లోకెళితే...

వాల్మీకిపురం నాటి వాయల్పాడులో సుమారు 60ఏళ్ల కిందట సినిమా టెంట్లు, హాళ్ల గురించి చెప్పుకుంటూ పోతే నాటి మధుర స్మృతులు ఎంత గొప్పగా ఉంటాయో. అప్పట్లో వాయల్పాడు అని చెప్పగానే ఎంతో గొప్పగా చెప్పుకునే పేర్లు సీతారాం, సీపీ మహల్ సినిమా థియేటర్లు అలరించిన ప్రదర్శనలు, సినిమాలు లేవనడంలో సందేహం లేదు. సీతారామ్ థియేటర్ వ్యవస్థాపకులు మొర్రంరెడ్డి థియేటర్ నిర్మాణం జరిగిన తర్వాత 1962లో సీతారామ్ థియేటర్ తెరపై మొదటి సినిమా ప్రదర్శితమైంది. అప్పట్లో శ్రీ వేంకటేశ్వరస్వామి మహత్యం మొదలు శ్రీకృష్ణావతారం, శ్రీకృష్ణవిజయం, జీవితచక్రం, లక్ష్మీకటాక్షం, రాము, దసరా బుల్లోడు, ప్రేమ్‌నగర్ ఇలా ఎన్నో ఎన్‌టీఆర్, నాగేశ్వరరావ్, చిరంజీవి, తదితర ఎందరో అగ్రహీరోల సినిమాలు గొప్పగా అలరించాయి. అప్పట్లో పావలా పెట్టి సినిమా చూసిన వారు బయటికి వచ్చి సినిమా చూసిన అనుభూతిని వివరిస్తూ సినిమా గొప్పదనాన్ని ఎంతో గొప్పగా చెప్పుకునే రోజులు. సినిమా మారుతుందంటే రెండు మూడు రోజుల ముందు గోడలకు పోస్టర్లను అంటించేవారు. ఊరంతా గోడలకు పోస్టర్లు అంటిస్తుంటే ఎంతో ఆత్రంగా ఏం సినిమా వస్తోంది అంటూ వాకబు చేసేరోజులవి. ఉదయం ఎద్దుల బండితో ప్రచారం, మధ్యాహ్నం ఒంటి గంటకు థియేటర్ నుంచి ఊరంతా వినిపించేలా రికార్డులతో మ్యాట్నీ షోలు ప్రారంభమయ్యేవి. గడిచిన అర్ధ శతాబ్దంలో (50ఏళ్లు) ఒక్క సీతారామ్ థియేటర్‌లో 4041 సినిమాలు 58,400 ప్రదర్శనలు సాగాయి. 30ఏళ్ల కిందటే వాల్మీకిపురంలోని సినిమా థికేటర్లకు జిల్లాలో మోడల్ థియేటర్‌లుగా పేరుండేది. పిల్లలకు సైతం ఎన్నో బెనిఫిట్ షోలు చూపించిన మహా ఘని సీతారామ్ టాకీస్. సీతారామ్‌లో షో మొదలైందంటే ఆరోజు కొత్తపేట వీధి జనాలతో నిండిపోయేది. అలాంటి కళ ఊరి ప్రజలకు నేడు కనుమరుగైంది. నేటికీ ఎంతో ప్రాచుర్యం పొందిన సినిమా థియేటర్లు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం సీతారాం థియేటర్ పాఠశాలగా మారిపోగా సీపీ మహల్ భవనాన్ని కల్యాణ మండపంగా మార్చేశారు. ఎంతో అలరించిన ఈ సినిమా థియేటర్లు ప్రస్తుతం లేకపోవడం... ఎలా ఉన్నా ఒకప్పటి జ్ఞాపకాలను స్థానికులు గుర్తు చేసుకుంటుంటారు. ఆ జ్ఞాపకాలు చిరకాలం ఉండిపోతాయని అంటున్నారు. నాటి నిర్మాణాలలో సీతారాం థియేటర్ భవనాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. అందులో పనిచేసిన సిబ్బంది కూడా మధుర జ్ఞాపకాలను నెమరేసుకుంటున్నారు.



థియేటర్‌లోని ప్రొజెక్టర్(ఫైల్‌ఫొటో)



పాఠశాలగా మారిన సీతారామ్ థియేటర్

ఊరి నడిబొడ్డున ఓ కళ..



మా తాత మొర్రంరెడ్డి స్థాపించిన సీతారాం థియేటర్ ఊరి నడిబొడ్డున ఓ ప్రత్యేకమైన కళ. 60ఏళ్ల కిందట అప్పటి కడప కలెక్టర్ మేజర్ పీవీ రత్నం చేతుల మీదుగా సినిమా హాలును ప్రారంభించారు. అప్పట్లోనే జిల్లా మోడల్ థియేటర్‌గా ఎంతో పేరు వచ్చింది. చిన్ననాటి రోజుల్లో రోజూ స్నేహితులతో కలిసి థియేటర్ వద్ద సందడి చేసేవాళ్లం. ఆ రోజులు, ఆ విలువలు మధుర జ్ఞాపకాలు.

మొర్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి, థియేటర్ యజమాని, వాల్మీకిపురం.

20ఏళ్లు ఆపరేటర్‌గా పనిచేశా..



సీతారాం థియేటర్‌లో 20ఏళ్లకు పైగా ప్రొజెక్టర్ ఆపరేటర్‌గా పనిచేశా. వందలాది సినిమాలు ప్రేక్షకులతో కలిసి చూసిన అనుభూతి ప్రత్యేకత. వేలాది ప్రదర్శనలతో అలరించిన సినిమా హాళ్లు ప్రస్తుతం లేవంటే బాధగా ఉంటోంది. హాలులో ఈలలు, కేకలు అంతా ఇంతా కాదు. ఆరోజులు, మధుర జ్ఞాపకాలు గుర్తుకువస్తుంటాయి. ఇప్పటికీ స్నేహితులు ఆపరేటర్ శీనా అనే పిలుస్తుంటారు. ఆధునిక యుగంలో పాత సినిమా హాళ్లు మరిచిపోతున్నారు.

శ్రీనివాసులు, (ఆపరేటర్ శీనా), గాంధీపేట, వాల్మీకిపురం.

టెంట్లు, థియేటర్ల కళ ఇక రాదు..



ఒకప్పుడు వాయల్పాడులో టెంటు ఉండేది. అప్పట్లోనే ఎందరో వచ్చేవారు. కొన్నేళ్లకు రెండు సినిమా థియేటర్లు కట్టడంతో రోజూ మూడు ఆటలతో సినిమాలు నడిచేవి. 15ఏళ్లు ఆపరేటర్‌గా పనిచేశా. అప్పట్లో ఆ వృత్తిలో చాలా గొప్పగా ఉండేది. జిల్లాలోనే మోడల్ సినిమా హాళ్లుగా పేరున్న మా ఊర్లో సినిమా హాళ్లు లేవంటేనే బాధగా ఉంటుంది. గుర్తుకు వచ్చినప్పుడల్లా స్నేహితులతో నాటి జ్ఞాపకాలను పంచుకుంటుంటాం.

శ్రీనివాసశాస్త్రి, (ఆపరేటర్ శీనాస్వామి), వాల్మీకిపురం

సర్పంచ్ కనబడుట లేదు..!

బెంగళూరులో ఉద్యోగం ● ప్రస్తుతం హాంగ్‌కాంగ్ పర్యటనలో ● బినామి సర్పంచ్‌గా వైసీపీ నేత
అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు ● కోళ్లబైలు-2 సర్పంచ్‌కు డీఎల్‌పీఓ నోటీసులు



విచారణ అంశాలను ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌కు వివరిస్తున్న ఈఓఆర్డీ అబ్దుల్ షుకూర్

మదనపల్లె టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోళ్లబైలు-2 (వైఎస్సార్ కాలనీ) సర్పంచ్ శశికళ కనపడుట లేదని, పంచాయతీ ప్రజలు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఆమె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసం ఉన్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె విదేశీ పర్యటనలో ఉన్నట్లు వారు వివరించారు. ఇక్కడ వైసీపీ నేత బండి మనోహర్ బినామీగా వ్యవహరిస్తున్నాడని, దీనిపై అధికారులు విచారించాలన్న ఫిర్యాదుపై మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు విచారించి సర్పంచ్‌కు నోటీసులు ఇచ్చారు. వివరాల్లోకెళితే...

2021 ఫిబ్రవరిలో కోళ్లబైలు-2 సర్పంచ్‌గా శశికళ ఎన్నికయ్యారు. వాస్తవంగా ఆమె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. మూడేళ్లగా అప్పుడప్పుడూ ఆమె గ్రామ సభలకు వచ్చి వెళ్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే సర్పంచ్ బదులు ఆమె అన్న, వైసీపీ నేత బండి మనోహర్ సర్పంచ్‌గా ఉన్నాడని ప్రజలు ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించాలని డీఎల్‌పీఓ నాగరాజు ఈఓఆర్‌డీ అబ్దుల్ షుకూర్‌కు లేఖ రాశారు. ఆదివారం ఈఓఆర్‌డీ కోళ్లబైలు-2కు వెళ్లి సర్పంచ్ శశికళ విషయమై విచారించారు. శశికళ బెంగళూరులో నివాసం వున్నారని, ఇటీవలే ఆమె విదేశీ పర్యటన నిమిత్తం హాంగ్‌కాంగ్ వెళ్లారని ఈఓఆర్‌డీకి ప్రజలు వివరించారు. సర్పంచ్ శశికళతో ఈఓఆర్‌డీ ఫోన్‌లో మాట్లాడగా తాను బయట వున్నానని, ఉన్నఫళంగా రమ్మంటే ఎలా వచ్చేదని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అయితే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం అధికారుల అనుమతిలేకుండా సర్పంచ్ విదేశాలకు వెళ్లరాదు. అంతేకాకుండా ప్రజలకు 15రోజులకు పైగా అందుబాటులో లేకుంటే సర్పంచ్ విధులను ఉపసర్పంచ్‌కు అప్పగించాల్సి వుంది. కానీ మూడేళ్లుగా ఇక్కడ అవేమీ జరగలేదు. బెంగళూరులో వుంటూ ప్రజలకు అందుబాటులో లేరని ప్రజలు ఈఓఆర్‌డీకి చెప్పారు. దీనిపై ఈఓఆర్‌డీ అబ్దుల్ షుకూర్, కార్యదర్శి గిరిధర్ నాయక్ మంగళవారం ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌కు విచారణలో తేలిన అంశాలను, పంచాయతీ కార్యదర్శి గిరిధర్‌నాయక్‌తో కలసి వివరించారు.

సర్పంచ్‌కు డీఎల్‌పీఓ నోటీసులు

కోళ్లబైలు-2లో ఈఓఆర్డీ వెళ్లి విచారించారు. ఏవైనా సమస్యలు సర్పంచ్‌కు తెలియచేద్దామంటే ఆమె బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసం వున్నట్లు కొత్తగా కార్యదర్శిగా చేరిన గిరిధర్‌నాయక్ అన్నట్లు తెలిసింది. గ్రామపంచాయతీ సమస్యలను తీర్చే అధికారం, నిధులు డ్రా చేసే అధికారం కేవలం సర్పంచ్‌కు మాత్రమే వుందని, కార్యదర్శికి లేదని తెలిసింది. సింగిల్ ఆపరేషన్ మోడ్‌లో సీఎఫ్ఎంఎస్ పీడీ అకౌంట్స్ నిర్వహణ, పీఎఫ్ఎంఎస్ 15వ ఫైనాన్స్ నిధులు డ్రా చేసే అధికారం సర్పంచ్‌కు మాత్రమే వున్నట్లు తెలిసింది. పంచాయతీ రికార్డులు, ఎం-బుక్కులు, క్యాష్‌బుక్, ఓచర్లు, రిజల్యూషన్ రిజిస్టర్ అన్నీ సర్పంచ్ అన్న బండి మనోహర్ దగ్గర వున్నట్లు కార్యదర్శి రిపోర్టులో వున్నట్లు తెలిసింది. మరో విశేషమేమంటే పంచాయతీ చెత్త తరలించే ట్రాక్టర్, పారిశుధ్య పరికరాలు కూడా మనోహర్ అధీనంలోనే వున్నట్లు కార్యదర్శి నివేదికలో పేర్కొన్నారు.

సర్పంచ్ అధికార క్షేత్రం నుంచి 15 రోజులకు మించి గైర్హాజరైతే, విధులు నిర్వహించకుంటే, ఆ సర్పంచ్ అధికారాలు, విధులు, ఉప సర్పంచ్‌కు బదలాయించాలి. ఈ వివరాలన్నింటినీ పొందుపరుస్తూ డీఎల్‌పీఓ 11న సర్పంచ్ శశికళకు సంజాయిషీ కోరుతూ లేఖ రాశారు. ఏడు రోజుల్లో ఈ లేఖకు సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు. అంతేకాకుండా మూడేళ్లలో కోళ్ల బైలు-2 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన బి.ప్రశాంతి, బి.రవీంద్రనాయక్, ఎస్.షాబాద్, పి.విజయకుమారికి డీఎల్‌పీఓ మెమోలు జారీ చేశారు. వారు విధులు నిర్వహించిన కాలంలో పంచాయతీ రికార్డులు, క్యాష్‌బుక్కులు తదుపరి కార్యదర్శికి అప్పగించిన చార్జిషీట్ వివరాలు మూడు రోజుల్లో డీఎల్‌పీఓ కార్యాలయానికి నివేదించాలని మెమోలో పొందుపరిచారు.

రుణాల కేసులో ఒకరికి జైలు శిక్ష

వాల్మీకిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాల కేసులో గిరిప్రసాద్‌కు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో తీర్పు వెలువరించింది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. వాల్మీకిపురం మండలంలో 17 మంది రైతులు 2014కు ముందు వాల్మీకిపురం సహకార బ్యాంకులో రుణాలు పొంది వాటిని అప్పటి ఏజెంట్ గిరిప్రసాద్‌కు చెల్లించారు. అయితే రైతులు చెల్లించిన డబ్బును ఏజెంట్ బ్యాంకుకు కట్టలేదు దీంతో బ్యాంకుల నుంచి రైతులకు నోటీసులు అందడంతో బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం కోర్టులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనం చోరీ కేసులో మూడు నెలలు జైలు...

రాయచోటిటౌన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): వాహనం చోరీ కేసులో నిందితుడికి మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం గుండ్లచెరువు గ్రామం మజ్జిగవాండ్లపల్లె సీఆర్పీఎస్ కానిస్టేబుల్ రెడ్డిప్రసాద్ జూలై 4న రాత్రి రాయచోటి ఆర్టీసీ బస్టాండు ఆవరణలో బైక్‌ను పార్క్ చేసి వెళ్లాడు. లక్కిరెడ్డిపల్లె మండలం కుర్నూతల గ్రామం వడ్డెపల్లె వాసి చౌడం రాజు అలియాస్ రాజు వాహనాన్ని దొంగిలించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరు పరచగా మూడు నెలల సాధారణ జైలుశిక్ష విధించినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ కడప డీఐజీగా ప్రసాద్

కలికిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ కడప డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా వీఎస్ఆర్ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లా రిజిస్ట్రారుగా వున్న ప్రసాద్‌కు పదోన్నతి కల్పించి కడప డీఐజీగా నియమించింది. 15 రోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. గడువులోగా బాధ్యతలు చేపట్టకున్నా లేదా సెలవులో వెళ్ళినా ఈ ఏడాది పదోన్నతుల జాబితా నుంచి ఆయన పేరు తొలగిస్తారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శిసోడియా ఆదేశాలు జారీ చేశారు.

చంపేస్తారా సారూ..

● విద్యార్థిని చితకబాదిన టీచర్
● లేచి నడవలేకపోతున్న విద్యార్థి
● వళ్లంతా గుల్లచేశాడు : తల్లి



గాయాలతో తల్లి ఒడిలో విద్యార్థి విఘ్నేశ్

సుండుపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని విద్యార్థిని టీచర్ వళ్లంతా వాచేలా కొట్టాడని, తప్పు చేస్తే మందలించాలే తప్ప ఎవరూ కొట్టరని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. చితకబాదడంతో విద్యార్థి తీవ్ర అస్వస్థతకు లోనవడంతో విద్యార్థి తల్లి దండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. వివరాల్లోకెళితే... జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం సాయంత్రం కొందరు విద్యార్థులు కొట్టుకున్నారు. అక్కడ ఏడో తరగతి విద్యార్థి బొమ్మల విఘ్నేశ్ కూడా ఉండడంతో ఆ విద్యార్థి కూడా గొడవలో పాల్గొన్నాడన్న ఉద్దేశంతో టీచర్ కొట్టాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు తప్పు చేస్తే భయపెట్టాలి లేదా తల్లిదండ్రులకు చెప్పాలే కానీ, వళ్లంతా వాచేలా కొట్టి లేవ లేని స్థితికి తీసుకువచ్చారంటూ తల్లిదండ్రులు, గుల్లవాండ్లపల్లె గ్రామస్తులు పాఠశాల వద్దకు వచ్చి ఆందోళన చేశారు. మీ పిల్లలను ఇలాగే కొడితే చూస్తూ ఉంటారా అని ఇతర ఉపాధ్యాయులను వారు ప్రశ్నించారు. గతంలో విఘ్నేశ్‌కు చేయి విరగడంతో సర్జరీ చేసిన చేతిపై వాతలు వచ్చేలా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి ఎక్కువగా అల్లరి చేస్తున్నాడని గతంలో అతని తండ్రికి చెప్పానని, ఈ రోజు కూడా అల్లరి చేయడంతోనే కొట్టానని, పొరపాటైందని టీచర్ లోకేశ్ చెప్పారు. ఇకపై అలా జరగకుండా చూసుకుంటానని క్షమాపణ చెప్పాడు. శాంతించిన తల్లిదండ్రులు విద్యార్థిని వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై విచారించి టీచర్‌పై చర్యలు తీసుకుం టామని మండల విద్యాఅధికారులు తెలిపారు.





ఎడమ చేతిపై, ఎడమ కాలిపై గాయాలు చూపుతున్న విద్యార్థి

పెన్నానదిలో మృతదేహం లభ్యం



రమణయ్య మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

సిద్దవటం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జంగాలపల్లె దర్జిపల్లె సమీప పెన్నానదిలో మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. సోమవారం రాత్రి స్థానికులు అందించిన సమాచారంతో జాలర్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. సిద్దవటం ఎగువపేట వాసి దేవర రమణయ్య(65)గా గుర్తించారు. కూతురు బత్తల లక్ష్మీదేవి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని పోలీసులు తెలియజేశారు.

గంజాయి మత్తులో...

- పులివెందులలో చెలరేగుతున్న గంజాయి బ్యాచ్
- 20, 50 గ్రాముల పొట్లాల్లో అమ్మకాలు
- సేల్స్‌మేన్ల ద్వారా విస్తృతంగా విక్రయాలు
- గంజాయి మత్తులో పెరుగుతున్న నేరాలు
- నియంత్రణలో చేతులెత్తేసిన నిఘా వ్యవస్థ



పులివెందుల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువత విద్యార్థుల జీవితాల్లో గంజాయి విషవృక్షంగా మారుతోంది. స్మగ్లర్లు కూడా వారినే టార్గెట్ చేసుకొని వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. కాలేజీ విద్యార్థులు, ఖాళీగా తిరిగే వారిని లక్ష్యంగా మత్తుకు బానిసలు చేస్తున్నారు. కొంతమంది స్వార్థపరులు రాజకీయ అవసరాలకు గంజాయి ముఠాలను తయారు చేశారు. ఆ మత్తులో యువకులు అరాచకాలకు పాల్పడుతున్నారు. ఇటీవల పులివెందులలో జరుగతున్న ఘర్షణలు, హత్యాయత్నాలు, చోరీలు తదితర ఘటనలు గంజాయి మత్తులో జరుగుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. ఇక వృద్ధులు, ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో పట్టణంలో నిత్యం ఏదోక ఘటన చోటుచేసుకోవడం పోలీసులకు తలనొప్పిగా మారింది.

పట్టణంలోని రాణితోపు పార్కు గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారింది. ఈ ప్రాంతంలోని యువకులు ఫూటుగా గంజాయి సేవించి విచక్షణ రహితంగా ఘర్షణలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో ఖాళీ స్థలాలు, లేఅవుట్లు అధికంగా ఉండడం, కొన్ని స్థలాల్లో ఖాళీ షెడు ఉన్నాయి. ఇక్కడ జన సంచారం లేకపోవడంతో గంజాయి సేవించేవారికి ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో పట్టణంలో జులాయిగా తిరుగుతూ మత్తుకు అలవాటు పడ్డ కొంతమంది మైనర్లు చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా వాకింగ్ వెళ్లే మహిళలు, ఒంటరిగా ఉన్న వృద్ధులను టార్గెట్ చేసుకుని వారి మెడలో ఉన్న గొలుసులు లాక్కెళ్లి.. వాటిని వచ్చిన కాడికి విక్రయించి ఆ సొమ్ముతో మద్యం, గంజాయి సేవించి మత్తులో జోగుతున్నారు. రాత్రిపూట రోడ్లపై కేరింతలు కొడుతూ చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారు. దీంతో పట్టణంలో నిత్యం ఏదోక చోట దొంగతనాలు జరుగుతున్నాయి. చిల్లర దుకాణాలు పగలగొట్టడం, ఊర్లకు వెళ్లిన ఇంటి డోర్లను పగలగొట్టడం, దేవాలయాల్లో హుండీలు ధ్వంసం చేసి నగదు అపహరణ చేస్తున్నారు. దీంతో బాధితులు పోలీసుస్టేషన్ చుట్టూ తిరుగుతుండటంతో పోలీసులు కొంతమంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

విద్యార్థులు బానిసలుగా మారుతూ...

ఇంటర్, డిగ్రీ చదువుతున్న సమయంలో స్నేహితులు, క్లాస్‌మెట్స్ క్రీడల్లో పరిచయమయ్యే వ్యక్తుల ద్వారా విద్యార్థులు మత్తుకు అలవాటు పడుతున్నారు. కొందరు 20 గ్రాములు, 30 గ్రాములు ప్యాకెట్లు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.200 నుంచి 300 వరకు వారికి విక్రయిస్తున్నారు. సిగరెట్లలో గంజాయి పొడి కలుపుకుని పీలుస్తూ బానిసలుగా మారుతున్నారు. దీంతో కొందరు స్మగ్లర్లు గంజాయి విక్రయాలకు సేల్స్‌మెన్స్‌ను నియమించుకుని కమిషన్‌తో పాటు నెలవారీ జీతాలు ఇస్తున్నారు. వీరు చేయాల్సింది కళాశాలల వద్ద బార్లు, మద్యం దుకాణాలు ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వర్కర్లను టార్గెట్ చేసుకుని వారి వద్దకు వెళ్లి గంజాయి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనిపై పోలీసులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలున్నాయి. పట్టణంలో గంజాయి, బహిరంగంగా మద్యం సేవించేవారిని నియంత్రించాలంటే ప్రత్యేకనిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాం



పులివెందుల డివిజను పరిధిలో గంజాయి అమ్మకాలను అరికట్టేందుకు పూర్తిస్థాయిలో కార్యాచరణ రూపొందించాం. గంజాయి విక్రయాలకు పాల్పడే కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. గంజాయి సరఫరా చేసేవారిపై ప్రత్యేకనిఘా పెట్టాం. పూర్తిస్థాయిలో గంజాయి కేసులు అదుపులోకి తెస్తాం.

-మురళీనాయక్, డీఎస్పీ, పులివెందుల

ఇటీవల జరిగిన నేరాలు

పట్టణంలోని కడప రోడ్డులో ఓ మహిళ కిరాణా షాపులో ఒంటరిగా ఉండడం గమనించి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కెళ్లారు. అలాగే పట్టణంలో అనేక చోట్ల బీరువాలు లాకర్లు బ్రేక్ చేసి బంగారు నగలు అపహరించారు. చిల్లర దుకాణాల్లో రాత్రుల్లో తలుపులు పగలగొట్టి నగదు అపహరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి పెట్టి గంజాయి, దొంగతనాలు అరికట్టాలని పులివెందుల ప్రజలు కోరుతున్నారు.

అందరికీ క్యాన్సర్ పరీక్షలు : డీఎంహెచ్‌వో

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి ఇంటిలో ఉన్న వారికి క్యాన్సర్‌పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం తమ చాంబరులో ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి ఎన్‌సీడీ 3.0 సర్వే ప్రారంభం అవుతుందన్నారు. సర్వేలో భాగంగా ప్రతి గృహంలో నివశిస్తున్న 18 ఏళ్ల పైబడ్డ స్త్రీ, పురుషులకు బీపీ, షుగరు, హిమోగ్లోబిన్, నోరు, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. 30 సంవత్సరాలు పైబడ్డ వివాహమైన స్త్రీలకు గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేస్తారన్నారు. ప్రస్తుతం ఉన్న ఆహార అలవాట్లు, జీవనశైలి విధానం వల్ల శారీరక మానసిక సామాజిక ఒత్తిడులతో పాటు రక్తపోటు, షుగరు జబ్బులతో బాధపడుతున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం జంక్‌ఫుడ్ ఆహార అలవాట్లు, గుట్కా, పాన్‌పరాక్, ఆల్కహాల్, పొగాకు సంబంధించిన చెడు అలవాట్లే అని ఆయన వివరించారు.

పిల్లలకు ఆరోగ్యపరీక్షలు : ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులందరికీ ఆర్గోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అందరికీ క్యాన్సర్ పరీక్షలు అనే గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్, ఆర్‌బీఎస్‌కే ఎన్‌సీడి ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ రమేశ్, డీటీసీవో డాక్టర్ సునీత, డాక్టర్ బాలాంజనేయులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త తదితరులు

వేంపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు లభించాయి. సీఎస్ఈ చదువుతున్న పదిమంది విద్యార్థులు అచల కంపెనీకి రూ.4.50లక్షల వార్షిక వేతనాలతో ఎంపికయ్యారని డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. అంపేర కంపెనీ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో రూ.5లక్షల వార్షిక వేతనంతో నలుగురు విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయన్నారు. ఎంపికైన విద్యార్థులకు రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సంద్ర అభినందనలు తెలిపారు. కార్య క్రమంలో అకడమిక్ డీన్ రమేష్ కైలాష్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కడప కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడపలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాయల సంస్థ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్ తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం కొండాయపల్లెలో గల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాలు ప్రారంభం కానున్నాయన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9-30 గంటలకు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో జాతీయ నాయకుల వేషధారణ పోటీలు ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం 2-30 గంటలకు పాఠశాల, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పాటల, వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. 15వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు పుస్తక ప్రదర్శన, 16న చెస్ పోటీలు, క్విజ్ పోటీలు, 17న బహుభాషా కవి సమ్మేళనం, 18న వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు, 19న మహిళా సాధికారత-మహిళలపై అఘాయిత్యాలు అనే అంశంపై చర్చా కార్యక్రమం ఉంటుందన్నారు. 20న బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమం జరుగనుందన్నారు. విద్యార్థులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వారోత్సవాలను విజయవంతం చేసేందుకు హాజరు కావాలని కోరారు.

జాతీయ ఫుట్‌బాల్ టోర్నీకి నవదీప్ ఎంపిక



కడప రూరల్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్రనాయకుడు, మాజీ ప్రభుత్వ ప్లీడర్ గడ్డ గుర్రప్ప కుమారుడు జి.నవదీప్ అండర్-19 జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో మణిపూర్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు కడప నగరం డీఎస్ఏ స్టేడియంలో శిక్షణ పొందుతున్నారు. నవంబర్ 8, 9, 10 తేదీలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 స్టేట్‌లెవల్ మెన్ అండ్ ఉమెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రభుత్వం నిర్వహించింది. ఈ టోర్నమెంట్‌లో బాలుర విభాగంలో జి.నవదీప్ మంచి ప్రతిభను కనబరిచి మణిపూర్‌లో జరిగే జాతీయ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఇతను కడప నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. నవదీప్ జాతీయ టోర్నమెంట్‌కు ఎంపిక కావడం పట్ల కడప బార్‌అసోసియేషన్ నాయకులు, పలువురు న్యాయవాదులు, టీడీపీ నేతలు, డీఎస్‌డీవో శిక్షకులు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు థామస్ జీవన్ బాబు అభినందించారు.

రాష్ట్రస్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు



పతకాలు సాధించిన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గంలో ఈనెల 9, 10 తేదీలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీలలో కడప క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో 8 మంది క్రీడాకారులు పాల్గొనగా.. ఐదుగురు ప్రతిభ కనబరచి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాయికిశోర్, ప్రధాన కార్యదర్శి షేక్షావలి వెల్లడించారు. మంగళవారం స్థానిక నాగరాజుపేటలో గల రెజ్లింగ్ కార్యాలయంలో పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని చాటిన క్రీడాకారలను అభినందించి మాట్లాడారు. ప్రధానంగా పోటీల 59 కేజీల విభాగంలో చలమల రేణుకారెడ్డి బంగారు పతకం సాధించగా, 72 కేజీల విభాగంలో సి.కీర్తనతో పాటు 92 కేజీల విభాగంలో భాస్కర్‌రెడ్డి వెండి పతకాలు సాధించారన్నారు. వీరితో పాటు 86 కేజీల విభాగంలో ఎన్.కౌశికేశ్వర్ రెడ్డి, 130 కేజీల విభాగంలో జె.వెంకట నవీన్ కాంస్య పతకాలు సాధించడం హర్షనీయమన్నారు. మున్ముందు మరిన్ని పతకాలు సాధించి జాతీయస్థాయిలో జిల్లా ఖ్యాతిని చాటాలన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి జయంతి మహోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యులు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి మహోత్సవాలు మంగళవారం పూర్వపు మఠాధిపతుల కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభ మయ్యాయి. ఉదయం ఆలయ ప్రాంగణంలో యాగశాల ప్రవేశం, కలశాలస్థాపన తదితర ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం స్వామివారికి ఆలయ ప్రాంగణం నుంచి కలశాల గ్రామోత్సవాన్ని నిర్వహించి.. పురవీధుల గుండా మహిళలచే కళశాలు ఊరేగింపుగా తీసుకెళ్లి వీరబ్రహ్మేంద్రపార్కులో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫిట్‌పర్సన్ శంకర బాలాజీ, మేనేజరు ఈశ్వరాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గండి క్షేత్రంలో ప్రారంభమైన పవిత్రోత్సవాలు



చక్రాయపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండిలో పవిత్రోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యా యి. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, విశ్వక్సేణ ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనధారణ, వాస్తు హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పారదర్శకంగా సాగుతున్న ఆర్మీ ఎంపికలు





అభ్యర్థుల ఆన్‌లైన్ ప్రక్రియ, రన్నింగ్‌కు ఉపక్రమిస్తున్న అభ్యర్థులు

కడప స్పోర్ట్స్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ స్టేడియంలో గత మూడు రోజులుగా జరుగుతున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా సాగుతోంది. సైనికుడిగా మాతృదేశ సేవలో తరించేందుకు అనువైన పరుగు పందెంతో పాటు ఇతర విభాగాలలో సైతం రాణించేందుకు జవసత్వాలను కూడగట్టుకొని మరీ అభ్యర్థులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా మైదానంలోకి ఇతరులు ఎవ్వరినీ అనుమతించకుండా, కేవలం అభ్యర్థులను మాత్రమే అనుమతిస్తూ.. ఆర్మీ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ముందస్తుగా అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టి తదుపరి మైదానంలో రన్నింగ్, హైజంప్, లాంగ్ జంప్, చినప్స్, జిగ్‌జాగ్ బ్యాలెన్స్, తదితర విభాగలలో పాల్గొనేలా బ్యాచ్‌కు 70 మందిని పంపిస్తున్నారు. కాగా, సజావుగా సాగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి తుఫాన్ అడ్డంకిగా మారనుందా అనే సందేహాలు ఉన్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా రాయలసీమలో వర్షాలు కురుస్తాయనే సంకేతాలున్న దృష్ట్యా అధికారుల్లో ఆందోళన నెలకొంది.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆసుపత్రులు, క్లినిక్స్, ల్యాబ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య హెచ్చరించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు లేకుండా అస్పత్రులు నిర్వహించినా క్లినిక్‌లు నడిపినా, ల్యాబ్‌లు ఏర్పాటు చేసినా ఆకస్మిక తనిఖీలు నిర్వహించడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లలో ఫైర్ డిపార్టుమెంట్ అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. క్లినిక్స్ ల్యాబ్స్ డయాగ్నొటిక్ సెంటర్స్ ఫిజియోథెరఫీ క్లినిక్‌లు, ప్రైవేటు హాస్పిటల్స్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు వాటికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ను కూడా జతపరచాలన్నారు. మున్సిపల్ నుంచి ట్రేడ్ లైసెన్స్, బిల్డింగ్ ప్లాన్ సర్టిఫికెట్స్ జత చేయాలని, ఆసుపత్రులు ఏర్పాటు చేసిన ఏరియా ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే ఆసుపత్రి ఆర్థిక పరిస్థితి వివరాలను తెలిపే ఆడిట్ రిపోర్టును పొందుపర్చాలని, నిర్దేశించిన నిబంధనలను పాటిస్తానని రూ.50ల స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్ పొందుపర్చాలన్నారు. బెడ్స్ ఉన్న ప్రతి హాస్పిటల్‌కి ఫైర్ ఎన్‌వోసీ, కాలుష్య నియంత్రణ బోర్డు నుంచి పొల్యూషన్, బయో మెడికల్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి హాస్పిటల్‌తో పాటు డయాగ్నస్టిక్ సెంటర్లలో ఏ పరీక్షకు ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ధరల పట్టికను నోటీస్ బోర్డులో ప్రకటించాలన్నారు.

కువైత్‌లో రోడ్డు ప్రమాదం బద్వేలు వాసి మృతి

బద్వేలుటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణం లోని చాకలివీధికి చెందిన షేక్‌మౌలాలి(55) కువైత్‌లో శుక్ర వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మౌలాలి గత కొన్ని సంవత్స రాలుగా కువైత్‌లో టైలర్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కువైత్‌లో ఓ పని నిమిత్తం బస్సులో వెళుతుండగా.. బస్సు ప్రమాదానికి గురికావడంతో మౌళాలి అక్కడిక్కడే మృతి చెందాడు. అక్కడి స్నేహితుల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక్క కుమారుడు ఉన్నారు. కాగా మంగళవారం మృతదేహానికి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మహిళ ఆత్మహత్య

ఎర్రగుంట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎర్ర గుంట్ల-ముద్ద నూరు రోడ్డులో నివాసం ఉంటున్న కల్లూరు శైలజ (32) మంగళ వారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కంచన్నగారిపల్లెకు చెందిన వీరారెడ్డితో శైలజకు ఆరు సంవ త్సరాల క్రితం వివాహమైంది. రెండేళ్లుగా అనారోగ్య సమస్యలు ఉండటంతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నా ఆరోగ్యం నయం కాలేదు. దీంతో ఆమె మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంక పోరంబోకులో..రాత్రికి రాత్రే అక్రమ కట్టడాలు

- ఉదయం వచ్చి కూల్చేసిన అధికారులు
- అధికారులకు, ఆక్రమణదారులకు మధ్య వాగ్వాదం



గంగరాజపురం ప్రధానదారి పక్కనే అక్రమ నిర్మాణాన్ని కూలదోస్తున్న అధికార సిబ్బంది

రైల్వేకోడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరాజపురం పంచాయతీ గంగరాజపురం గ్రామం సర్వే నెంబరు 178లోని 2.3 ఎకరాల వంక పోరంబోకు విస్తీర్ణంలో సోమవారం రాత్రికి రాత్రే కొందరు పునాదులు తీసి ఏకంగా షెడ్డు నిర్మాణం చేపట్టారు. విషయం తెలిసి మంగళవారం ఉదయం రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖాధికారులు రంగంలోకి దిగి పనులు నిలుపుదల చేయించి ఆక్రమణలు కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజల మధ్య వాగ్వాగం చోటు చేసుకుంది. రైల్వేకోడూరు తహశీల్దార్ మహబూబ్ చాంద్, వీఆర్‌వో సుజని తమ సిబ్బందితో ఆక్రమణలను తొలగించి బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఆక్రమణ చేసిన స్థలం పూర్తిగా వంకపోరంబోకు అని తెలిపారు. ఈ స్థలాన్ని ఎవరూ ఆక్రమించరాదని తెలిపారు. అలా ఆక్రమించడానికి చూస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2.3 ఎకరాలు పూర్తిగా వంక పోరంబోకు స్థలం అని తెలిపారు. షెడ్డు నిర్మాణం పక్కనే కొందరు వ్యక్తులు నిర్మాణాలు చేయడానికి గుంతలు తీసి ఉండడాన్ని గుర్తించి వాటిని కూడా పూడ్చివేశామన్నారు. ఎవరు ఆక్రమించినా వదిలే ప్రసక్తి లేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వంక పోరంబోకు స్థలాలు, ఏటి పోరంబోకు స్థలాలు ఎవరూ ఆక్రమించరాదని తెలిపారు. ప్రభుత్వ స్థలాలపై రెవెన్యూశాఖ కన్నువేసి ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బందిపై దౌర్జన్యం చేస్తే మాత్రం కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణదారులపై ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్‌వో సుజని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరరావు తెలిపారు. రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్‌బాబు, ఆర్ఐ లక్ష్మీదేవి, సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ ఏఈ మధుసూదన్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ విజయలక్ష్మీదేవికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డును స్వీకరిస్తున్న విజయలక్ష్మీదేవి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) :ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ విజయలక్ష్మీదేవి రాష్ట్రఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా స్వీకరించారు. ఈ నేపథ్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీం బాషా హర్షం వ్యక్తం చేశారు.

స్థానిక అవసరాలకు ఉచితంగానే ఇసుక

● భూగర్భ జల శాఖ డైరెక్టర్ రాధ

ఒంటిమిట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పంచాయతీ పరిధిలోని ప్రజలు ట్రాక్టర్లు, ఎడ్ల బండి ద్వారా ఉచితంగా ఇసుకను తరలించు కోవచ్చని భూగర్భ జల శాఖ డైరెక్టర్ రాధ తెలిపారు. ఇసుక రీచ్‌పై పెద్దఎత్తున ఆరోపణలు రావడంతో భూగర్భజల డైరెక్టర్ రాధా ఆధ్వర్యంలో భూగర్భగనులశాఖ అధికారులు పరిశీలించి డంపింగ్ కేంద్రం వద్ద అధికారికంగా స్టాక్‌పాయింట్ ఏర్పాటు చేశారు. టన్ను 136 చొప్పున ప్రభు త్వానికి చెల్లించి సచివాలయంలో నమోదు చేసుకుంటేనే ఇసుక నింపుతా రని తెలిపారు.స్థానికంగా పంచాయతీ పరిధిలోని ప్రజలు ఉచితంగా నదిలోకి వెళ్లి ట్రాక్టర్‌లు, యెడ్లబండ్ల ద్వారా తరలించుకోవచ్చునని ఆమె అన్నారు. ఇతర పంచాయతివారు బయట వ్యక్తులు సచివాలయంలో నిబంధనలకు అనుగుణంగా బుక్‌చేసుకుని డంపింగ్ కేంద్రాల నుంచి ఇసుకను తీసుకు పోవచ్చునని ఆమె వివరించారు.

రీచ్‌ను పరిశీలించిన ఆర్డీవో

బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో మండలంలోని దర్శిపల్లె ఇసుకరీచ్‌ను కడప ఆర్డీవో జాన్‌ఎర్విన్ పాలపర్తి తహసీల్దారు రమణమ్మతో కలసి మంగళవారం పరిశీలించారు. రీచ్‌లో పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా చేస్తున్న విషయాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీ నుంచి యంత్రాలతో ఇసుకను తరలించేందుకు అనుమతి లేదని రీచ్ ప్రతినిధులకు సూచించారు. అనంతరం ఇసుక కోసం వచ్చిన ట్రాక్టర్లను రెవెన్యూ అధికా రులు వెనక్కి పంపారు. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు అక్కడికి చేరుకుని తమ గ్రామంలో ఇసుకను తరలిస్తే అడ్డుకుంటామని నినాదాలు చేశారు. వారు రీచ్‌వద్దకు వెళ్లకుండా ఎస్‌ఐ శివప్రసాద్ అడ్డుకున్నారు.



ఇసుక రీచ్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీవిఓ జాన్‌ఎర్విన్ పాలపర్తి

ఇసుక అక్రమ రవాణాపై రైతుల ఆగ్రహం

వీరబల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాతో భవిష్యత్‌లో నీటికి ఇబ్బందులు ఏర్పడతాయంటూ వీరబల్లి మండలంలో ఇసుక తరలించే వాహనాలను రైతులు అడ్డుకున్నారు. రాగిమానుదిన్నె పల్లి సమీపంలో మాండవ్య నదినుంచి ఇసుక సేకరించడానికి వచ్చిన రామాపురానికి చెందిన రెండు ట్రాక్టర్లను రైతులు అడ్డుకుని వెనక్కి పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారుల్లో ఏ మాత్రం చలనం లేదన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మాండవ్యనదిలో ఏ మాత్రం ఇసుక మిగలదని కేవలం రాళ్లు, గుంతలు మాత్రమే కనిపిస్తాయన్నారు. ఎవరైనా దౌర్జన్యంగా తరలించాలని చూస్తే కనీస అవసరాలకు కూడా తరలించకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉచిత ఇసుక విధానం అమలుకు చర్యలు తీసుకోండి

సిద్దవటం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంగాలపల్లె వద్ద పెన్నానది నుంచి ఉచితంగా ఇసుక సేకరణకు అనుమతి ఇవ్వాలని మంగళవారం మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలతకు గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. గ్రామస్థులు ఉచితంగా ఇసుక తీసుకెళ్లకుండా కొందరు వ్యక్తులు రహదారికి అడ్డంగా గుంతలు తీశారని ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారం చేస్తామని తహసీల్దారు సమాధానమిచ్చారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టళ్లలో ట్యూటర్ల నియామకం

●సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి జయప్రకాశ్

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థుల కోసం ట్యూటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి జయప్రకాశ్ తెలిపారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలోని ఎస్సీ 1, ఎస్సీ 2 హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులతో మెనూపై ఆరా తీశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎస్సీ 1 హాస్టల్ ను అద్దెభవనంలోకి మారుస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పాతబడిన హాస్టల్ భవనాలకు త్వరలో మరమ్మతులు చేయిస్తామన్నారు. జిల్లాలోని 55 హాస్టళ్లలో దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవోలు శ్రీనివాసులు, రమేష్‌బాబు,సావిత్రి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగంపై నిర్లక్ష్యం'



ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నేతలు

రాయచోటిటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 10.9 శాతం మాత్రమే కేటాయించడం అన్యాయమని అఖిల భారత విద్యార్థి పరిషత్ అన్నమయ్య జిల్లా కన్వీనర్ జేపీ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం ఏబీవీపీ రాయచోటి పట్టణశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి రాష్ట్ర బడ్జెట్‌తో స్పష్టమవుతోందన్నారు. ఈ బడ్జెట్‌తో తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయగలుగుతారా అని ప్రశ్నించారు. కర్నూలు జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నాయన్నారు. నగర కార్యదర్శి విజయ్, దేవప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్‌తోనే రైల్వే కార్మికుల శ్రేయస్సు



కార్మికులతో మజ్దూర్ యూనియన్ జోనల్ సెక్రెటరీ శంకర్‌రావు

నందలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైల్వే కార్మికుల శ్రేయస్సుకు మజ్దూర్ యూని యన్ తోడ్పడుందని ఆ యూని యన్ జోనల్ జనరల్ సెక్రెటరీ శంకర్‌రావు తెలిపారు. డిసెంబరు 4, 5, 6 తేదీల్లో జరిగే కార్మిక సంఘాల ఎన్నికల సందర్భంగా ఆయ మంగళవారం రైల్వేకోడూరు, రాజంపేట, నందలూరు స్టేషన్ల పరిధిలోని మజ్దూర్ యూనియన్ నాయకులతో కలిసి కార్మికులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తోందనిని దీనిని కట్టడి చేయాలంటే రాబోవు ఎన్నికల్లో సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు.

నేడు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

పుల్లంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై స్థానిక ఎంపీడీవో సభాభవనంలో బుధవారం శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో జయశ్రీ తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆమె కోరారు. శిక్షణ కార్యక్రమానికి తమ ఆధార్‌కార్డులు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

ఒంటిమిట్టను కరవు మండలంగా ప్రకటించాలి

ఒంటిమిట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టను కరవు మండలంగా ప్రకటించాలని సీపీఎం మండల కార్యదర్శి కోనేటి నరసయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం ఈ మేరకు తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కె.నరసయ్య మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో క సకాలంలో వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోయాయి. కాబట్టి కరవు మండలంగా ప్రకటించాలని అన్నారు. లేనిచో ఈనెల 14న కలెక్టరేట్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హులైనవారందరికి భూపంపిణీ చేయాలని కోరారు. సాగులో ఉన్నటువంటి పేదలకు సాగు పట్టాలు మంజూరు చేయాలన్నారు. రైతుసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ఒంటిమిట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ నెల 14 నుంచి ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ హిమశ్వేత తెలిపారు. ఈ పరీక్షల ద్వారా గర్భాశయ, నోరు, రొమ్ము కేన్సర్‌ను గుర్తిస్తామన్నారు. కేన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి రక్షించుకోవచ్చునని ఆమె తెలిపారు. ప్రజలు ప్రభుత్వ వైద్యసిబ్బందిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు.

సుబ్రహ్మణ్యుడికి వెండి తొడుగు



వెండి తొడుగు తెస్తున్న భక్తులు

రైల్వేకోడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బలిజవీధికి చెందిదన తోట యుగంధర్ దంపతులు భుజంగేశ్వరాలయంలోని సుబ్రహ్మణ్యం స్వామికి వెండి తొడుగు సమర్పించారు. అర్చకుడు యోగి స్వామికి వెండితొడుగును అలంకరించారు. అనంతరం పూజలు చేశారు.

మీ సేవ కేంద్రం సీజ్



మీసేవ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు మున్ని, ఎస్ఐ నాగేశ్వరరావు

రాజంపేటటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ప్రధాన రహదారిలో ఉన్న ఎస్ఎం మీసేవా ఆన్‌లైన్ సర్వీస్ కేంద్రాన్ని మంగళవారం తహసీల్దారు మున్ని, ఎస్ఐ నాగేశ్వరరావు తనిఖీ చేశారు. ఆధార్‌లో మార్పులు చేర్పులకోసం నిర్వాహకులు శ్రీనివాసులు పెద్దమొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దారు స్పందించారు. నిర్వాహకులు లేకపోవడంతో తాళాలు పగులగొట్టి ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ రికార్డులను పరిశీలించారు. సంతకాలు ఫోర్జరీ చేస్తున్నారని, నకిలీ స్టాంపులు తయారు చేస్తున్నారని, తప్పుడు ఆధార్ పత్రాలు సృష్టిస్తున్నారని, ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని, పలురకాల ఆరోపణలు రావడంతో పోలీసుల సహకారంతో కేంద్రాన్ని సీజ్ చేశారు. వీటిపై క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, సమగ్ర విచారణ చేసి వివరాలు తెలుపుతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శేషంరాజు, ఏఎస్ఐ వర్మ, వీఆర్వో రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ముట్టడి



ఎంపీడీవోతో మాట్లాడుతున్న ఉపాధి కూలీలు

పెనగలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కూలి గిట్టుబాటయ్యే పనులు చూపించాలంటూ పెనగలూరు పంచాయతీకి చెందిన ఉపాధి హామీ కూలీలు మంగళవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. పలుగు, పార, తట్ట బుట్ట చేతబట్టి కార్యాలయం ముందు నిరసన తెలిపారు. 11 గంటలకు కార్యాలయానికి చేరుకున్న ఎంపీడీవోకు తమ సమస్య విన్నవించారు. రోజుకు 60 కూలి అందితే అందులో 40 రూపాయలు ఆటో చార్జీలకు ఖర్చవుతుండడంతో, మిగిలిన 20 రూపాయలతో ఏవిధంగా జీవించాలో చెప్పాలని సూచించారు. కూలీలకు అనువైన ప్రాంతంలో కాకుండా ఉపాధి సిబ్బంది తమ ఇష్టం వచ్చినచోట గట్టి నేలలో పని కల్పిస్తే తాము ఏమ చేయాలన్నారు. ఇదేమిటని ఈసీని, టీఏను అడిగితే అది అంతేనని చెబుతున్నారని వాపోయారు. ఈ విషయంపై ఎంపీడీవో విజయరావు ఏపీవో మురళిని తన కార్యాలయానికి పిలిపించి ఆరా తీయగా., కొలతల ప్రకారమే కూలి చెల్లించినట్లు తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శికి సత్కారం

రైల్వేకోడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ఫణీంద్రయాదవ్‌ను మంగళవారం. మంగళవారం ఆ సంస్థ స్థానిక కార్యాలయంలో మంగళవారం యూటీఎఫ్ అధ్యక్షుడు ఎన్. మనోహర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో తాను ఉపాధ్యాయ సమస్యల పై నిరంతరాయంగా పోరాటాలు చేస్తామని తెలిపారు.

నిరక్షరాస్యతను నిర్మూలించాలి

సిద్దవటం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యత నిర్మూలనకు తోడ్పడాలని ఎంపీడీవో ఫణిరాజకుమారి సూచించారు. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో మంగళవారం నిరక్షరాస్యత నిర్మూలనపై డ్వాక్రా సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా మార్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల విద్యాశాఖాధికారి-2 అరుణ, ఏపీఎం సుజాత, సీడీపీవో శోభారాణి, సూపర్‌వైజర్ శ్రీవిద్య, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పని వేళలు పాటించకుంటే చర్యలు

గాలివీడు, నవంబరు12(ఆంధ్రజ్యోతి): సమయపాలన లేని అంగన్వాడీ హెల్పర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని లక్కిరెడ్డిపల్లె సీడీపీవో పద్మావతి హెచ్చరించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో అంగన్వాడీ సహాయకురాళ్లకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉదయం 8 గంటల ముప్పై నిమిషాల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విధులు నిర్వహించాలని తెలిపారు.మెనూ ప్రకారం ప్రతిరోజు పిల్లలకు ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుజాతరెడ్డి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు

జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపిక

రాజంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు రాజంపేటకు చెందిన సాయిప్రతాప్ ఎంపికయ్యాడు. గీతాంజలి కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న సాయిప్రతాప్ ఇటీవల విజయవాడలో నిర్వహించిన అండర్-19 అంతర్‌జిల్లాల వాలీబాల్ పోటీల్లో పాల్గొని జాతీయస్థాయికి ఎంపికైనట్లు ఆ సంస్థల అధినేత ఎస్వీ రమణ, ఫిజికల్ డైరెక్టర్ షామీర్‌బాషా తెలిపారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో మన రాష్ట్రం నుంచి సాయిప్రతాప్ పాల్గొంటారని వారు తెలిపారు.

'జాతీయ కబడ్డీ' పోటీలకు నాగిరెడ్డిపల్లె విద్యార్థి

నందలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి సయ్యద్ ఉమర్ ఉస్మాన్‌అలీ కబడ్డీ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. సోమవారం బాపట్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అతను ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ముక్కా రూపానందరెడ్డికి సన్మానం

ఓబులవారిపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ తెలుగు దేశంపార్టీ ఇన్‌చార్జి, అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డిని బొమ్మవరం టీడీపీ సీనియర్ నాయకులు శాలువా కప్పి అభినందించారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు ఉమ్మలరాజు సుబ్బరాజు, సీనియర్ నాయకులు ఉమ్మలరాజు పిచ్చిరాజు, సిమెంట్ డీలర్ ఉమ్మలరాజు సుబ్బరాజు, మాజీ ఎంపీటీసీ శంకర్‌రాజు, శివరాజు, వంపన నాగేంద్ర పాల్గొన్నారు.

అత్తిరాల ఉత్సవాల కరపత్రాలు విడుదల

రాజంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అత్తిరాల క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలపై దేవాదాయశాఖ జిల్లా అధికారి సి.విశ్వనాథ్, టూరిజం అధికారి కొండారెడ్డి ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈనెల 15న శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహిసామన్నారు. రుద్రాభిషేకం, కుంకుమార్చన, గోమాత ప్రదర్శన, కార్తీక వనభోజనం, మహిళా కోలాటం, పండరిభజన, శిఖర దీప దర్శనం, చెయ్యేరులో గంగా హారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గిరి ప్రదర్శన, గ్రామోత్సవం, సంగీత కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పూల నరసింహులు, ప్రధాన అర్చకులు పద్మనాభస్వామి, సిద్దిలింగారెడ్డి, పోకల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో ఓ మోస్తరు వర్షం

పెనగలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళవారం మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. తెల్లవారుజామున ప్రారంభమైన జల్లు, ఉదయం ఆరు గంటలకు వర్షంగా మారింది. మంచి వర్షం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.

గ్రామసభలతోనే భూసమస్యల పరిష్కారం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామసభల ద్వారానే భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చుని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కుర్నూతల గ్రామపరిధిలోని అగ్రహారంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. రీసర్వే కారణంగా ఏర్పడిన భూసమస్యలను ఈ సందర్భంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, మదన్ మోహన్ రెడ్డి, మండల నాయకుడు యనమల మదన్ మోహన్, ఆర్ఐ రాజేష్, గ్రామ టీడీపీ నాయకులు మండ్ల రామాంజనేయులు ఓబుల్‌రెడ్డి, శివారెడ్డి, వెంకటరామిరెడ్డి, గ్రామ సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

రాయచోటిటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అర్చనా విద్యాసంస్థల అధినేత డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని ఎగువ అబ్బవరం హరిజనవాడ, కటవకింద పాపిరెడ్డిగారి పల్లెలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ మెంబర్ షిప్ తీసుకోవడం సమాజంలో ఒక గౌరవం, గుర్తింపుగా మారిందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో నేతలు, కార్యకర్తలు రికార్డు స్థాయిలో సభ్యత్వాలు నమోదు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామయ్య, గ్రామ నాయకులు రామకృష్ణ, రాజేంద్ర, రవితేజ, నాగయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం: మండలంలోని బాకరాపేట గ్రామంలో తెలుగుదేశంపార్టీ నాయకుడు కాడే చెంచయ్యనాయుడు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదు యువతకు భరోసా ఇస్తుందని తెలియజేశారు. ప్రతిఒక్కరు 100 రూపాయలు చెల్లించి టీడీపీ సభ్యత్వం పొందాలని సూచించారు. పార్టీ పటిష్టత దెబ్బతినేవిధంగా పనిగట్టుకుని సుగవాసిపై ఆరోపణలు చేయడం తగదని, పార్టీ ఐక్యతకు అందరూ కృషి చేయాలన్నారు. రాజంపేట నియోజకవర్గ అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు, ఓబులేశు, సుబ్బరాయుడు, కాడే శ్రీను పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని హసనాపురం పంచాయతీ కొండవాండపల్లెలో టీడీపీ సీనియర్ నాయకులు నాగభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు.

17న మెగా ఉచిత వైద్య శిబిరం

లక్కిరెడ్డిపల్లె,నవంబరు(ఆంధ్రజ్యోతి) ఈనెల 17న ఆదివారం మానవత ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మానవత స్వచ్ఛంద సేవ కేంద్ర కమిటీ సభ్యుడు వై ప్రసాదుయాదవ్ తెలిపారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో దన్వి నారాయణి ఇన్‌స్టిట్యూట్ మెడికల్ సైన్స్ వారి సౌజన్యంతో గర్భిణులు, షుగర్, ఎముకలు కీళ్లనొప్పులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని ఆయన తెలిపారు.


ప్రజాపోరు పోస్టర్ల ఆవిష్కరణ

రాజంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14న నిర్వహించనున్న ప్రజాపోరు ధర్నా పోస్టర్లను సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, మణి ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. విద్యుత్ చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, నిరుద్యోగ భృతి తదితర అంశాలపై ఈ ధర్నా నిర్వహించనున్నట్లు వారు వివరించారు.

వాహనం చోరీ కేసులో మూడు నెలలు జైలు...

రాయచోటిటౌన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): వాహనం చోరీ కేసులో నిందితుడికి మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. అర్బన్ పోలీసుల కథనం మేరకు అన్నమయ్య జిల్లా కలికిరి మండలం గుండ్లచెరువు గ్రామం మజ్జిగవాండ్లపల్లె సీఆర్పీఎస్ కానిస్టేబుల్ రెడ్డిప్రసాద్ జూలై 4న రాత్రి రాయచోటి ఆర్టీసీ బస్టాండు ఆవరణలో బైక్‌ను పార్క్ చేసి వెళ్లాడు. ఆ వాహనాన్ని లక్కిరెడ్డిపల్లె మండలం కర్నూతల గ్రామం వడ్డెపల్లె వాసి చౌడం రాజు అలియాస్ రాజు దొంగిలించాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నింది తుడిని కోర్టులో హాజరు పరచగా మూడు నెలల సాధారణ జైలుశిక్ష విధించినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు



గుబ్బల నరేశ్

చిన్నమండెం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన గుబ్బలనరేశ్ (44) కనిపించడం లేదంటు ఆయన. భార్య గుబ్బల మంజుల మంగళవారం చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

కళాజాతాను జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న కళాజాతా ఈ నెల 15వ తేదీ ఉదయం రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్దకు చేరుకుంటుందని, దీనిని జయప్రదం చేయాలని ఎల్ఐసీ యూనియన్ రాయచోటి బ్రాంచ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, ఆదినారాయణరెడ్డి, సీఐటీయూజిల్లా ప్రధాన కార్యదర్శి రాజాంజులు, జిల్లా ఉపాధ్యక్షులు ఏవీ రమణ పిలుపునిచ్చారు. మంగళవారం వారు స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట కళాజాతా గోడపత్రాలను విడుదల చేశారు.

సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జిల్లా సహకారశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో 71వ అఖిల భారత సహకార వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ 14 నుంచి 20 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ఎంతో ఉందన్నారు. 14న సహకార సంఘాల బలోపేతానికి సహకార మంత్రిత్వశాఖ అమలు చేస్తున్న కొత్త కార్యక్రమాలు, 15న నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన, 16న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర, 17న సహకార సంఘాలు వ్యాపార ప్రయోజక సంస్థలుగా రూపాంతరం చెందే కార్యక్రమాలు, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించే కార్యక్రమాలు, 19న మహిళలు, యువత, బలహీన వర్గాల సంక్షేమంలో సహకార సంఘాలు, 20న సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనలో, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకారశాఖ అధికారి గురుప్రకాశ్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటికే పోస్టల్ సేవలు : ఎస్పీ లక్ష్మణ్

రూ. 300కే ఖాతా ప్రారంభం

సంక్షేమ పథకాల లావాదేవీలు పోస్టాఫీసుల్లోనే



ఎంపీడీఓతో మాట్లాడుతున్న పోస్టల్ అధికారి లక్ష్మణ్

పెద్దతిప్పసముద్రం నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసుల ద్వారా ప్రజలు ఖాతాలు తెరిస్తే సంక్షేమ పథకాల లావాదేవీలు డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాలకే నేరుగా అందుతాయని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ (ఎస్పీ), బి. లక్ష్మణ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం అజాద్‌తో భేటీ అయి పోస్టాఫీసుల్లో ఖాతాలను తెరిచేందుకు సచివాలయ ఉద్యోగులు సహకరించాలని కోరారు. గ్రామీణ తపాలా బ్రాంచుల్లో ప్రజలు ఆధార్ కార్డుతో ఖాతాను ప్రారంభిస్తే సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల పోస్టాఫీస్ ఖాతాల్లో పడతాయన్నారు. బ్యాంకులు అందుబాటులో లేని గ్రామాల్లో సైతం గ్రామీణులకు ఉపయోగం ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే రైతుభరోసా, ఉపాధిహామీ, పెన్షన్ ప్రభుత్వం అందించే పథకాల లావాదేవీని ప్రతి ఖాతాదారుడు ఇంటిచెంతనే లబ్ధి పొందే అవకాశాలు ఉంటాయన్నారు. లబ్ధిదారులు సచివాలయాల పరిధిలోనూ ఆధార్ కార్డుతో రూ. 300 చెల్లించి ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ పేమెంట్ (ఐపీబీపీ) ద్వారా ఖాతాను ప్రారంభించవచ్చన్నారు. అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో సుమారు 470 తపాలా బ్రాంచీలు ఉన్నాయని అందులో తాము 2లక్షల 70 వేల ఖాతాలు చేయాలనే లక్ష్యంతో తమ సిబ్బంది పని చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఖాతాలను ప్రారంభించామని నెలాఖరులోపు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సచివాలయ ఉద్యోగులు, మండల అధికారులు సహకరించాలన్నారు. మాఖాతాలకు ఫోన్ పే, గూగుల్ పే కూడా అనుసంధానం చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్, నీలిమ, పీటీఎం పోస్టాఫీసు ఎస్పీఎం రాజారెడ్డి, గ్రామీణ తపాలా ఉద్యోగుల యూనియన్ సెక్రటరీ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

ప్రయాణికులకు తప్పని అవస్థలు

ములకలచెరువు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మీదుగా నడిచే రైళ్లు మంగళవారం ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. నరసాపురం నుంచి ములకలచెరువు మీదుగా ధర్మవరం జంక్షన్‌కు నడిచే ధర్మవరం ఎక్స్‌ప్రెస్ సాంకేతిక కారణాలతో రెండున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడిచింది. ఈ రైలు పీలేరుకు తెల్లవారుజామున 5.39 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 7.54కు, కలికిరికి తెల్లవారుజామున 5.54 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 8.14 గంటలకు, మదనపల్లె రోడ్‌కు ఉదయం 6.19కి రావాల్సి ఉండగా ఉదయం 8.44కు, ములకలచెరువుకు ఉదయం 6.49కి రావాల్సి ఉండగా 9.30 గంటలకు వచ్చింది. రైలు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరుపతి నుంచి గుంతకల్లు జంక్షన్‌కు రోజూ ఉదయం నడిచే ప్యాసింజర్ రైలు ములకలచెరువుకు ఉదయం 10.39 గంటలకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 12.12 గంటలకు వచ్చింది. గుంతకల్లు జంక్షన్ నుంచి తిరుపతికి నడిచే మరో ప్యాసింజర్ రైలు ములకలచెరువుకు ఉదయం 10.49 గంటలకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 12.17 గంటలకు వచ్చింది.

ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న సదరున్నీసా



సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న సదరున్నీసా

రైల్వేకోడూరు, నవంబరు 12:(ఆంధ్రజ్యోతి) అనంతరాజుపేట ఉద్యాన కళాశాల కూరగాయల విభాగాధిపతి సయ్యద్ సదరున్నీసా సోమవారం విజయవాడలో నిర్వహించిన విద్యా దినోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్నట్లు మంగళవారం ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్ తెలిపారు. 20 ఏళ్లుగా ఆమె చేసిన సేవకు గుర్తింపు లభించిందని ఆయన తెలిపారు. తోటి అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రెడ్డి మోక్షిత్ మృతిపై పౌరహక్కుల సంఘం విచారణ



ఉపాధ్యాయులను విచారిస్తున్న దృశ్యం

పీలేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్యారంపల్లె గురుకులంలో రెడ్డి మోక్షిత్ ఉదంతంపై ఉమ్మడి కడప జిల్లా పౌరహక్కుల సంఘం నేతలు మంగళవారం విచారణ చేపట్టారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు నేతృత్వంలోని బృందం గ్యారంపల్లె గురుకులం, పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి, కేవీపల్లె పోలీసులు, రెడ్డి మోక్షిత్ తల్లిదండ్రులను విచారించింది. ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రవిశంకర్ మాట్లాడుతూ మోక్షిత్ మరణంపై అతని తల్లి అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. తమ విచారణలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలిందని, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతోనే మోక్షిత్ మృతి చెందాడన్నారు. అనుమానాలను పోలీసులు నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నేతలు రెడ్డయ్య, వంగిమళ్ల రమణయ్య పాల్గొన్నారు.

కాలుజారి బావిలో పడి యువకుడు మృతి



వెంకటేశు మృతదేహం

లక్కిరెడ్డిపల్లె,నవంబరు12(ఆంధ్రజ్యోతి): కస్తూరిరాజుగారిపల్లె పంచాయతీ గురయ్యగారిపల్లె యువకుడు వెంకటేశు(28) ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. మృతుడి తల్లి వివరాల మేరకు... వెంకటేశు బెంగళూరులో ఉండేవాడు. సోమవారం బెంగళూరు నుంచి గ్రామానికి వచ్చాడు. మంగళవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లి ఎంతసేపటికీ రాకపోవడంతో మృతుడి తల్లి పొలం వద్దకు వెళ్లి చూడగా బావిలో శవమై తేలాడు. స్థానికులు శవాన్ని బయటకు తీసి పోస్టు మార్టం కోసం స్థానిక ప్రభుత్వ తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



సీతారాం థియేటర్ భవనం

మణిమకుటం 'సీతారాం'

● అప్పటి అద్భుతం గోపురం..

● మరపురాని మధుర స్మృతులెన్నెన్నో

● అలరించిన టెంటు, థియేటర్లు..కనుమరుగు

● నెమరేసుకుంటున్న స్థానికులు

వాల్మీకిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాటి ప్రజలకు కాలక్షేపం నాటకాలు, తోలుబొమ్మలాట, సినిమా, థియేటర్లు. 1958 డిసెంబరు 30న మొర్రంరెడ్డి నిర్మించిన సినిమా థియేటర్ సీతారాం జిల్లాకే మణిమకుటం. అప్పట్లో సినిమా ప్రొజెక్టర్, సౌండ్ సిస్టం, లైటింగ్ ఎఫెక్ట్ జపాన్ టెక్నాలజీ ఉపయోగించారు. థియేటర్ పునాది మొదలు థియేటర్ ప్రారంభం వరకు అప్పటి కడప కలెక్టర్ మేజర్ పీవీ రత్నం ద్వారా ప్రారంభించారు. 1962లో సీతారాం థియేటర్ తెరపై మొదటి సినిమా ప్రదర్శితమైంది. కొత్త సినిమా వచ్చిందంటే వీధి వీధంతా పండుగను తలపించేంది. వీధిలో మూడు రోడ్లు కలిసే ప్రాంతం కిటకిటలాడే జనంతో ఈలలు, కేకలతో నిండిపోయేది. కాలక్రమేణా జీవన వేగంలో మార్పురావడం, మదనపల్లెలో కొత్త థియేటర్ల నిర్మాణం, ఏసీ థియేటర్లతో కొత్త సినిమాల క్రేజీతో ప్రజలు మదనపల్లెకు వెళ్లి సినిమాలు చూడడం మొదలైంది. దీంతో 2008 ఫిబ్రవరి2వ తేదీన మహాయాగం, అన్నదానం, చేసి ప్రజలకు జీవితచక్రం, బండరాముడు, శ్రీకృష్ణలీల సినిమాలను ఉచితంగా ప్రదర్శించి సీతారాం సినిమా థియేటర్‌కు తెరదించేశారు. మరో సినిమా థియేటర్ సీఏ మహల్ కూడా ఇంతటి అనుభూతిని మిగిల్చినా 2009లో సినిమా థియేటర్ మూతపడింది. అప్పట్లో ప్రజలను అలరించిన సీతారాం థియేటర్ ప్రస్తుతం భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే పాఠశాలగా రూపాంతరం చెందగా మరోథియేటర్ సీఏ మహల్ రూపురేఖలు మార్చి కల్యాణ మండ పంలా మారిపోయింది. ఎంతో గొప్ప గుర్తింపు ఉన్న సీతారాం థియేటర్ విషయాలను గుర్తు చేసుకోవాల్సిందే. వివరాల్లోకెళితే...

వాల్మీకిపురం నాటి వాయల్పాడులో సుమారు 60ఏళ్ల కిందట సినిమా టెంట్లు, హాళ్ల గురించి చెప్పుకుంటూ పోతే నాటి మధుర స్మృతులు ఎంత గొప్పగా ఉంటాయో. అప్పట్లో వాయల్పాడు అని చెప్పగానే ఎంతో గొప్పగా చెప్పుకునే పేర్లు సీతారాం, సీఏ మహల్ సినిమా థియేటర్లు అలరించిన ప్రదర్శనలు, సినిమాలు లేవనడంలో సందేహం లేదు. సీతారామ్ థియేటర్ వ్యవస్థాపకులు మొర్రంరెడ్డి థియేటర్ నిర్మాణం జరిగిన తర్వాత 1962లో సీతారామ్ థియేటర్ తెరపై మొదటి సినిమా ప్రదర్శితమైంది. అప్పట్లో శ్రీ వేంకటేశ్వరస్వామి మహత్యం మొదలు శ్రీకృష్ణావతారం, శ్రీకృష్ణవిజయం, జీవితచక్రం, లక్ష్మీకటాక్షం, రాము, దసరా బుల్లోడు, ప్రేమ్‌నగర్ ఇలా ఎన్నో ఎన్‌టీఆర్, నాగేశ్వరరావ్, చిరంజీవి, తదితర ఎందరో అగ్రహీరోల సినిమాలు గొప్పగా అలరించాయి. అప్పట్లో పావలా పెట్టి సినిమా చూసిన వారు బయటికి వచ్చి సినిమా చూసిన అనుభూతిని వివరిస్తూ సినిమా గొప్పదనాన్ని ఎంతో గొప్పగా చెప్పుకునే రోజులు. సినిమా మారుతుందంటే రెండు మూడు రోజుల ముందు గోడలకు పోస్టర్లను అంటించేవారు. ఊరంతా గోడలకు పోస్టర్లు అంటిస్తుంటే ఎంతో ఆత్రంగా ఏం సినిమా వస్తోంది అంటూ వాకబు చేసేరోజులవి. ఉదయం ఎద్దుల బండితో ప్రచారం, మధ్యాహ్నం ఒంటి గంటకు థియేటర్ నుంచి ఊరంతా వినిపించేలా రికార్డులతో మ్యాట్నీ షోలు ప్రారంభమయ్యేవి. గడిచిన అర్ధ శతాబ్దంలో (50ఏళ్ల) ఒక్క సీతారామ్ థియేటర్‌లో 4041 సినిమాలు 58,400 ప్రదర్శనలు సాగాయి. 30ఏళ్ల కిందటే వాల్మీకిపురంలోని సినిమా థియేటర్లకు జిల్లాలో మోడల్ థియేటర్‌లుగా పేరుండేది. పిల్లలకు సైతం ఎన్నో బెనిఫిట్ షోలు చూపించిన మహా ఘని సీతారామ్ టాకీస్. సీతారామ్‌లో షో మొదలైందంటే ఆరోజు కొత్తపేట వీధి జనాలతో నిండిపోయేది. అలాంటి కళ ఊరి ప్రజలకు నేడు కనుమరుగైంది. నేటికీ ఎంతో ప్రాచుర్యం పొందిన సినిమా థియేటర్లు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం సీతారాం థియేటర్ పాఠశాలగా మారిపోగా సీఏ మహల్ భవనాన్ని కల్యాణ మండపంగా మార్చేశారు. ఎంతో అలరించిన ఈ సినిమా థియేటర్లు ప్రస్తుతం లేకపోవడం... ఎలా ఉన్నా ఒకప్పటి జ్ఞాపకాలను స్థానికులు గుర్తు చేసుకుంటుంటా రు. ఆ జ్ఞాపకాలు చిరకాలం ఉండిపోతాయని అంటున్నారు. నాటి నిర్మాణాలలో సీతారాం థియేటర్ భవనాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. అందులో పనిచేసిన సిబ్బంది కూడా మధుర జ్ఞాపకాలను నెమరేసుకుంటున్నారు.



థియేటర్‌లోని ప్రొజెక్టర్(ఫైల్‌ఫొటో)



పాఠశాలగా మారిన సీతారామ్ థియేటర్

ఊరి నడిబొడ్డున ఓ కళ..



మా తాత మొర్రంరెడ్డి స్థాపించిన సీతారాం థియేటర్ ఊరి నడిబొడ్డున ఓ ప్రత్యేకమైన కళ. 60ఏళ్ల కిందట అప్పటి కడప కలెక్టర్ మేజర్ పీవీ రత్నం చేతుల మీదుగా సినిమా హాలును ప్రారంభించారు. అప్పట్లోనే జిల్లా మోడల్ థియేటర్‌గా ఎంతో పేరు వచ్చింది. చిన్ననాటి రోజుల్లో రోజూ స్నేహితులతో కలిసి థియేటర్ వద్ద సందడి చేసేవాళ్లం. ఆ రోజులు, ఆ విలువలు మధుర జ్ఞాపకాలు.

మొర్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి, థియేటర్ యజమాని, వాల్మీకిపురం.

20ఏళ్లు ఆపరేటర్‌గా పనిచేశా..



సీతారాం థియేటర్‌లో 20ఏళ్లకు పైగా ప్రొజెక్టర్ ఆపరేటర్‌గా పనిచేశా. వందలాది సినిమాలు ప్రేక్షకులతో కలిసి చూసిన అనుభూతి ప్రత్యేకత. వేలాది ప్రదర్శనలతో అలరించిన సినిమా హాళ్లు ప్రస్తుతం లేవంటే బాధగా ఉంటోంది. హాలులో ఈలలు, కేకలు అంతా ఇంతా కాదు. ఆరోజులు, మధుర జ్ఞాపకాలు గుర్తుకువస్తుంటాయి. ఇప్పటికీ స్నేహితులు ఆపరేటర్ శీనా అనే పిలుస్తుంటారు. ఆధునిక యుగంలో పాత సినిమా హాళ్లు మరిచిపోతున్నారు.

శ్రీనివాసులు, (ఆపరేటర్ శీనా), గాంధీపేట, వాల్మీకిపురం.

టెంట్లు, థియేటర్ల కళ ఇక రాదు..



ఒకప్పుడు వాయల్పాడులో టెంటు ఉండేది. అప్పట్లోనే ఎందరో వచ్చేవారు. కొన్నేళ్లకు రెండు సినిమా థియేటర్లు కట్టడంతో రోజూ మూడు ఆటలతో సినిమాలు నడిచేవి. 15ఏళ్లు ఆపరేటర్‌గా పనిచేశా. అప్పట్లో ఆ వృత్తిలో చాలా గొప్పగా ఉండేది. జిల్లాలోనే మోడల్ సినిమా హాళ్లుగా పేరున్న మా ఊర్లో సినిమా హాళ్లు లేవంటేనే బాధగా ఉంటుంది. గుర్తుకు వచ్చినప్పుడల్లా స్నేహితులతో నాటి జ్ఞాపకాలను పంచుకుంటుంటాం.

శ్రీనివాసశాస్త్రి, (ఆపరేటర్ శీనాస్వామి), వాల్మీకిపురం

సర్పంచ్ కనబడుట లేదు..!

బెంగళూరులో ఉద్యోగం ● ప్రస్తుతం హాంగ్‌కాంగ్ పర్యటనలో ● బినామి సర్పంచ్‌గా వైసీపీ నేత

అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు ● కోళ్లబైలు-2 సర్పంచ్‌కు డీఎల్‌పీఓ నోటీసులు



విచారణ అంశాలను ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌కు వివరిస్తున్న ఈఓఆర్డీ అబ్దుల్ షుకూర్

మదనపల్లె టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోళ్లబైలు-2 (వైఎస్సార్ కాలనీ) సర్పంచ్ శశికళ కనపడుట లేదని, పంచాయతీ ప్రజలు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఆమె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసం ఉన్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె విదేశీ పర్యటనలో ఉన్నట్లు వారు వివరించారు. ఇక్కడ వైసీపీ నేత బండి మనోహర్ బినామీగా వ్యవహరిస్తున్నాడని, దీనిపై అధికారులు విచారించాలన్న ఫిర్యాదుపై మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు విచారించి సర్పంచ్‌కు నోటీసులు ఇచ్చారు. వివరాల్లోకెళితే...

2021 ఫిబ్రవరిలో కోళ్లబైలు-2 సర్పంచ్‌గా శశికళ ఎన్నికయ్యారు. వాస్తవంగా ఆమె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. మూడేళ్లగా అప్పుడప్పుడూ ఆమె గ్రామ సభలకు వచ్చి వెళ్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే సర్పంచ్ బదులు ఆమె అన్న, వైసీపీ నేత బండి మనోహర్ సర్పంచ్‌గా ఉన్నాడని ప్రజలు ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించాలని డీఎల్‌పీఓ నాగరాజు ఈఓఆర్‌డీ అబ్దుల్ షుకూర్‌కు లేఖ రాశారు. ఆదివారం ఈఓఆర్‌డీ కోళ్లబైలు-2కు వెళ్లి సర్పంచ్ శశికళ విషయమై విచారించారు. శశికళ బెంగళూరులో నివాసం వున్నారని, ఇటీవలే ఆమె విదేశీ పర్యటన నిమిత్తం హాంగ్‌కాంగ్ వెళ్లారని ఈఓఆర్‌డీకి ప్రజలు వివరించారు. సర్పంచ్ శశికళతో ఈఓఆర్‌డీ ఫోన్‌లో మాట్లాడగా తాను బయట వున్నానని, ఉన్నఫళంగా రమ్మంటే ఎలా వచ్చేదని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అయితే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం అధికారుల అనుమతిలేకుండా సర్పంచ్ విదేశాలకు వెళ్లరాదు. అంతేకాకుండా ప్రజలకు 15రోజులకు పైగా అందుబాటులో లేకుంటే సర్పంచ్ విధులను ఉపసర్పంచ్‌కు అప్పగించాల్సి వుంది. కానీ మూడేళ్లగా ఇక్కడ అవేమీ జరగలేదు. బెంగళూరులో వుంటూ ప్రజలకు అందుబాటులో లేరని ప్రజలు ఈఓఆర్‌డీకి చెప్పారు. దీనిపై ఈఓఆర్‌డీ అబ్దుల్ షుకూర్, కార్యదర్శి గిరిధర్ నాయక్ మంగళవారం ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌కు విచారణలో తేలిన అంశాలను, పంచాయతీ కార్యదర్శి గిరిధర్‌నాయక్‌తో కలసి వివరించారు.

సర్పంచ్‌కు డీఎల్‌పీఓ నోటీసులు

కోళ్లబైలు-2లో ఈఓఆర్డీ వెళ్లి విచారించారు. ఏదైనా సమస్యలు సర్పంచ్‌కు తెలియచేద్దామంటే ఆమె బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసం వున్నట్లు కొత్తగా కార్యదర్శిగా చేరిన గిరిధర్‌నాయక్ అన్నట్లు తెలిసింది. గ్రామపంచాయతీ సమస్యలను తీర్చే అధికారం, నిధులు డ్రా చేసే అధికారం కేవలం సర్పంచ్‌కు మాత్రమే వుందని, కార్యదర్శికి లేదని తెలిసింది. సింగిల్ ఆపరేషన్ మోడ్‌లో సీఎఫ్ఎంఎస్ పీడీ అకౌంట్స్ నిర్వహణ, పీఎఫ్ఎంఎస్ 15వ ఫైనాన్స్ నిధులు డ్రా చేసే అధికారం సర్పంచ్‌కు మాత్రమే వున్నట్లు తెలిసింది. పంచాయతీ రికార్డులు, ఎం-బుక్కులు, క్యాష్‌బుక్, ఓచర్లు, రిజల్యూషన్ రిజిస్టర్ అన్నీ సర్పంచ్ అన్న బండి మనోహర్ దగ్గర వున్నట్లు కార్యదర్శి రిపోర్టులో వున్నట్లు తెలిసింది. మరో విశేషమేమంటే పంచాయతీ చెత్త తరలించే ట్రాక్టర్, పారిశుధ్య పరికరాలు కూడా మనోహర్ అధీనంలోనే వున్నట్లు కార్యదర్శి నివేదికలో పేర్కొన్నారు.

సర్పంచ్ అధికార క్షేత్రం నుంచి 15 రోజులకు మించి గైర్హాజరైతే, విధులు నిర్వహించకుంటే, ఆ సర్పంచ్ అధికారాలు, విధులు, ఉప సర్పంచ్‌కు బదలాయించాలి. ఈ వివరాలన్నింటినీ పొందుపరుస్తూ డీఎల్‌పీఓ 11న సర్పంచ్ శశికళకు సంజాయిషి కోరుతూ లేఖ రాశారు. ఏడు రోజుల్లో ఈ లేఖకు సంజాయిషి ఇవ్వాలని పేర్కొన్నారు. అంతేకాకుండా మూడేళ్లలో కోళ్ల బైలు-2 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన బి.ప్రశాంతి, బి.రవీంద్రనాయక్, ఎస్.షాబాద్, పి.విజయకుమారికి డీఎల్‌పీఓ మెమోలు జారీ చేశారు. వారు విధులు నిర్వహించిన కాలంలో పంచాయతీ రికార్డులు, క్యాష్‌బుక్కులు తదుపరి కార్యదర్శికి అప్పగించిన చార్జిషీట్ వివరాలు మూడు రోజుల్లో డీఎల్‌పీఓ కార్యాలయానికి నివేదించాలని మెమోలో పొందుపరిచారు.

చంపేస్తారా సారూ..

● విద్యార్థిని చితకబాదిన టీచర్

● లేచి నడవలేకపోతున్న విద్యార్థి

● వళ్లంతా గుల్లచేశాడు : తల్లి



గాయాలతో తల్లి ఒడిలో విద్యార్థి విఘ్నేశ్

సుండుపల్లె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని విద్యార్థిని టీచర్ వల్లంతా వాచేలా కొట్టాడని, తప్పు చేస్తే మందలించాలే తప్ప ఎవరూ కొట్టరని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. చితకబాదడంతో విద్యార్థి తీవ్ర అస్వస్థతకు లోనవడంతో విద్యార్థి తల్లి దండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. వివరాల్లోకెళితే... జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం సాయంత్రం కొందరు విద్యార్థులు కొట్టుకున్నారు. అక్కడ ఏడో తరగతి విద్యార్థి బొమ్మల విఘ్నేశ్ కూడా ఉండడంతో ఆ విద్యార్థి కూడా గొడవలో పాల్గొన్నాడన్న ఉద్దేశంతో టీచర్ కొట్టాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు తప్పు చేస్తే భయపెట్టాలి లేదా తల్లిదండ్రులకు చెప్పాలే కానీ, వళ్లంతా వాచేలా కొట్టి లేవ లేని స్థితికి తీసుకువచ్చారంటూ తల్లిదండ్రులు, గుల్లవాండ్లపల్లె గ్రామస్థులు పాఠశాల వద్దకు వచ్చి ఆందోళన చేశారు. మీ పిల్లలను ఇలాగే కొడితే చూస్తూ ఉంటారా అని ఇతర ఉపాధ్యాయులను వారు ప్రశ్నించారు. గతంలో విఘ్నేశ్‌కు చేయి విరగడంతో సర్జరీ చేసిన చేతిపై వాతలు వచ్చేలా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి ఎక్కువగా అల్లరి చేస్తున్నాడని గతంలో అతని తండ్రికి చెప్పానని, ఈ రోజు కూడా అల్లరి చేయడంతోనే కొట్టానని, పొరపాటైందని టీచర్ లోకేశ్ చెప్పారు. ఇకపై అలా జరగకుండా చూసుకుంటానని క్షమాపణ చెప్పాడు. శాంతించిన తల్లిదండ్రులు విద్యార్థిని వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై విచారించి టీచర్‌పై చర్యలు తీసుకుం టామని మండల విద్యాఅధికారులు తెలిపారు.





ఎడమ చేతిపై, ఎడమ కాలిపై గాయాలు చూపుతున్న విద్యార్థి

రుణాల కేసులో ఒకరికి జైలు శిక్ష

వాల్మీకిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాల కేసులో గిరిప్రసాద్‌కు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో తీర్పు వెలువరించింది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. వాల్మీకిపురం మండలంలో 17 మంది రైతులు 2014కు ముందు వాల్మీకిపురం సహకార బ్యాంకులో రుణాలు పొంది వాటిని అప్పటి ఏజెంట్ గిరిప్రసాద్‌కు చెల్లించారు. అయితే రైతులు చెల్లించిన డబ్బును ఏజెంట్ బ్యాంకుకు కట్టలేదు దీంతో బ్యాంకుల నుంచి రైతులకు నోటీసులు అందడంతో బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం కోర్టులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనం చోరీ కేసులో మూడు నెలలు జైలు...

రాయచోటిటౌన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): వాహనం చోరీ కేసులో నిందితుడికి మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం గుండ్లచెరువు గ్రామం మజ్జిగవాండ్లపల్లె సీఆర్పీఎస్ కానిస్టేబుల్ రెడ్డిప్రసాద్ జూలై 4న రాత్రి రాయచోటి ఆర్టీసీ బస్టాండు ఆవరణలో బైక్‌ను పార్క్ చేసి వెళ్లాడు. లక్కిరెడ్డిపల్లె మండలం కర్నూతల గ్రామం వడ్డెపల్లె వాసి చౌడం రాజు అలియాస్ రాజు వాహనాన్ని దొంగిలించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరు పరచగా మూడు నెలల సాధారణ జైలుశిక్ష విధించినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ కడప డీఐజీగా ప్రసాద్

కలికిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ కడప డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా వీఎస్ఆర్ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లా రిజిస్ట్రారుగా వున్న ప్రసాద్‌కు పదోన్నతి కల్పించి కడప డీఐజీగా నియమించింది. 15 రోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. గడువులోగా బాధ్యతలు చేపట్టకున్నా లేదా సెలవులో వెళ్ళినా ఈ ఏడాది పదోన్నతుల జాబితా నుంచి ఆయన పేరు తొలగిస్తారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శిసోడియా ఆదేశాలు జారీ చేశారు.

పెన్నానదిలో మృతదేహం లభ్యం



రమణయ్య మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

సిద్దవటం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జంగాలపల్లె దర్గిపల్లె సమీప పెన్నానదిలో మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. సోమవారం రాత్రి స్థానికులు అందించిన సమాచారంతో జాలర్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. సిద్దవటం ఎగువపేట వాసి దేవర రమణయ్య(65)గా గుర్తించారు. కూతురు బత్తల లక్ష్మీదేవి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని పోలీసులు తెలియజేశారు.

గంజాయి మత్తులో...

- పులివెందులలో చెలరేగుతున్న గంజాయి బ్యాచ్
- 20, 50 గ్రాముల పొట్లాల్లో అమ్మకాలు
- సేల్స్‌మేన్ల ద్వారా విస్తృతంగా విక్రయాలు
- గంజాయి మత్తులో పెరుగుతున్న నేరాలు
- నియంత్రణలో చేతులెత్తేసిన నిఘా వ్యవస్థ

పులివెందుల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువత విద్యార్థుల జీవితాల్లో గంజాయి విషపు వృక్షంగా మారుతోంది. స్మగ్లర్లు కూడా వారినే టార్గెట్ చేసుకొని వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. కాలేజీ విద్యార్థులు, ఖాళీగా తిరిగే వారిని లక్ష్యంగా మత్తుకు బానిసలు చేస్తున్నారు. కొంతమంది స్వార్థపరులు రాజకీయ అవసరాలకు గంజాయి ముఠాలను తయారు చేశారు. ఆ మత్తులో యువకులు అరాచకాలకు పాల్పడుతున్నారు. ఇటీవల పులివెందులలో జరుగతున్న ఘర్షణలు, హత్యాయత్నాలు, చోరీలు తదితర ఘటనలు గంజాయి మత్తులో జరుగుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. ఇక వృద్ధులు, ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో పట్టణంలో నిత్యం ఏదోక ఘటన చోటుచేసుకోవడం పోలీసులకు తలనొప్పిగా మారింది.

పట్టణంలోని రాణితోపు పార్కు గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారింది. ఈ ప్రాంతంలోని యువకులు ఫూటుగా గంజాయి సేవించి విచక్షణ రహితంగా ఘర్షణలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో ఖాళీ స్థలాలు, లేఅవుట్లు అధికంగా ఉండడం, కొన్ని స్థలాల్లో ఖాళీ షెడు ఉన్నాయి. ఇక్కడ జన సంచారం లేకపోవడంతో గంజాయి సేవించేవారికి ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో పట్టణంలో జులాయిగా తిరుగుతూ మత్తుకు అలవాటు పడ్డ కొంతమంది మైనర్లు చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా వాకింగ్ వెళ్లే మహిళలు, ఒంటరిగా ఉన్న వృద్ధులను టార్గెట్ చేసుకుని వారి మెడలో ఉన్న గొలుసులు లాక్కెళ్లి.. వాటిని వచ్చిన కాడికి విక్రయించి ఆ సొమ్ముతో మద్యం, గంజాయి సేవించి మత్తులో జోగుతున్నారు. రాత్రిపూట రోడ్లపై కేరింతలు కొడుతూ చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారు. దీంతో పట్టణంలో నిత్యం ఏదోక చోట దొంగతనాలు జరుగుతున్నాయి. చిల్లర దుకాణాలు పగలగొట్టడం, ఊర్లకు వెళ్లిన ఇంటి డోర్లను పగలగొట్టడం, దేవాలయాల్లో హుండీలు ధ్వంసం చేసి నగదు అపహరణ చేస్తున్నారు. దీంతో బాధితులు పోలీసుస్టేషన్ చుట్టూ తిరుగుతుండటంతో పోలీసులు కొంతమంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

విద్యార్థులు బానిసలుగా మారుతూ...

ఇంటర్, డిగ్రీ చదువుతున్న సమయంలో స్నేహితులు, క్లాస్‌మేట్స్ క్రీడల్లో పరిచయమయ్యే వ్యక్తుల ద్వారా విద్యార్థులు మత్తుకు అలవాటు పడుతున్నారు. కొందరు 20 గ్రాములు, 30 గ్రాములు ప్యాకెట్లు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.200 నుంచి 300 వరకు వారికి విక్రయిస్తున్నారు. సిగరెట్లలో గంజాయి పొడి కలుపుకుని పీలుస్తూ బానిసలుగా మారుతున్నారు. దీంతో కొందరు స్మగ్లర్లు గంజాయి విక్రయాలకు సేల్స్‌మెన్స్‌ను నియమించుకుని కమిషన్‌తో పాటు నెలవారీ జీతాలు ఇస్తున్నారు. వీరు చేయాల్సింది కళాశాలల వద్ద బార్లు, మద్యం దుకాణాలు ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వర్కర్లను టార్గెట్ చేసుకుని వారి వద్దకు వెళ్లి గంజాయి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనిపై పోలీసులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలున్నాయి. పట్టణంలో గంజాయి, బహిరంగంగా మద్యం సేవించేవారిని నియంత్రించాలంటే ప్రత్యేకనిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాం



పులివెందుల డివిజను పరిధిలో గంజాయి అమ్మకాలను అరికట్టేందుకు పూర్తిస్థాయిలో కార్యాచరణ రూపొందించాం. గంజాయి విక్రయాలకు పాల్పడే కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. గంజాయి సరఫరా చేసేవారిపై ప్రత్యేకనిఘా పెట్టాం. పూర్తిస్థాయిలో గంజాయి కేసులు అదుపులోకి తెస్తాం.

-మురళీనాయక్, డీఎస్పీ, పులివెందుల



ఇటీవల జరిగిన నేరాలు

పట్టణంలోని కడప రోడ్డులో ఓ మహిళ కిరాణా షాపులో ఒంటరిగా ఉండడం గమనించి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కెళ్లారు. అలాగే పట్టణంలో అనేక చోట్ల బీరువాలు లాకర్లు బ్రేక్ చేసి బంగారు నగలు అపహరించారు. చిల్లర దుకాణాల్లో రాత్రుల్లో తలుపులు పగలొగొట్టి నగదు అపహరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి పెట్టి గంజాయి, దొంగతనాలు అరికట్టాలని పులివెందుల ప్రజలు కోరుతున్నారు.

అందరికీ క్యాన్సర్ పరీక్షలు : డీఎంహెచ్‌వో

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి ఇంటిలో ఉన్న వారికి క్యాన్సర్‌పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం తమ చాంబరులో ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి ఎన్‌సీడీ 3.0 సర్వే ప్రారంభం అవుతుందన్నారు. సర్వేలో భాగంగా ప్రతి గృహంలో నివశిస్తున్న 18 ఏళ్ల పైబడ్డ స్త్రీ, పురుషులకు బీపీ, షుగరు, హిమోగ్లోబిన్, నోరు, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. 30 సంవత్సరాలు పైబడ్డ వివాహమైన స్త్రీలకు గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేస్తారన్నారు. ప్రస్తుతం ఉన్న ఆహార అలవాట్లు, జీవనశైలి విధానం వల్ల శారీరక మానసిక సామాజిక ఒత్తిడులతో పాటు రక్తపోటు, షుగరు జబ్బులతో బాధపడుతున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం జంక్‌ఫుడ్ ఆహార అలవాట్లు, గుట్కా, పాన్‌పరాక్, ఆల్కాహాల్, పొగాకు సంబంధించిన చెడు అలవాట్లే అని ఆయన వివరించారు.

పిల్లలకు ఆరోగ్యపరీక్షలు : ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులందరికీ ఆర్గోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అందరికీ క్యాన్సర్ పరీక్షలు అనే గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్, ఆర్‌బీఎస్‌కే ఎన్‌సీడి ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ రమేష్, డీటీసీవో డాక్టర్ సునీత, డాక్టర్ బాలాంజనేయులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త తదితరులు

వేంపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు లభించాయి. సీఎస్ఈ చదువుతున్న పదిమంది విద్యార్థులు అచల కంపెనీకి రూ.4.50లక్షల వార్షిక వేతనాలతో ఎంపికయ్యారని డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. అంపేర కంపెనీ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో రూ.5లక్షల వార్షిక వేతనంతో నలుగురు విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయన్నారు. ఎంపికైన విద్యార్థులకు రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సంద్ర అభినందనలు తెలిపారు. కార్య క్రమంలో అకడమిక్ డీన్ రమేష్, కైలాష్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కడప కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కడపలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాయల సంస్థ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్ తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం కొండాయపల్లెలో గల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాలు ప్రారంభం కానున్నాయన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిణీ మీనాక్షి హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9-30 గంటలకు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో జాతీయ నాయకుల వేషధారణ పోటీలు ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం 2-30 గంటలకు పాఠశాల, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పాటల, వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. 15వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు పుస్తక ప్రదర్శన, 16న చెస్ పోటీలు, క్విజ్ పోటీలు, 17న బహుభాషా కవి సమ్మేళనం, 18న వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు, 19న మహిళా సాధికారత-మహిళలపై అఘాయిత్యాలు అనే అంశంపై చర్చా కార్యక్రమం ఉంటుందన్నారు. 20న బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమం జరుగనుందన్నారు. విద్యార్థులు, వివిధ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు వారోత్సవాలను విజయవంతం చేసేందుకు హాజరు కావాలని కోరారు.

జాతీయ ఫుట్‌బాల్ టోర్నీకి నవదీప్ ఎంపిక



కడప రూరల్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్రనాయకుడు, మాజీ ప్రభుత్వ ప్లీడర్ గడ్డ గుర్రప్ప కుమారుడు జి.నవదీప్ అండర్-19 జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో మణిపూర్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు కడప నగరం డీఎస్ఏ స్టేడియంలో శిక్షణ పొందుతున్నారు. నవంబర్ 8, 9, 10 తేదీలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 స్టేట్‌లెవల్ మెన్ అండ్ ఉమెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రభుత్వం నిర్వహించింది. ఈ టోర్నమెంట్‌లో బాలుర విభాగంలో జి.నవదీప్ మంచి ప్రతిభను కనబరిచి మణిపూర్‌లో జరిగే జాతీయ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఇతను కడప నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. నవదీప్ జాతీయ టోర్నమెంట్‌కు ఎంపిక కావడం పట్ల కడప బార్‌అసోసియేషన్ నాయకులు, పలువురు న్యాయవాదులు, టీడీపీ నేతలు, డీఎస్‌డీవో శిక్షకులు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు థామస్ జీవన్ బాబు అభినందించారు.

రాష్ట్రస్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు



పతకాలు సాధించిన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గంలో ఈనెల 9, 10 తేదీలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీలలో కడప క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో 8 మంది క్రీడాకారులు పాల్గొనగా.. ఐదుగురు ప్రతిభ కనబరచి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాయికిశోర్, ప్రధాన కార్యదర్శి షేక్షావలి వెల్లడించారు. మంగళవారం స్థానిక నాగరాజుపేటలో గల రెజ్లింగ్ కార్యాలయంలో పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని చాటిన క్రీడాకారలను అభినందించి మాట్లాడారు. ప్రధానంగా పోటీల 59 కేజీల విభాగంలో చలమల రేణుకారెడ్డి బంగారు పతకం సాధించగా, 72 కేజీల విభాగంలో సి.కీర్తనతో పాటు 92 కేజీల విభాగంలో భాస్కర్‌రెడ్డి వెండి పతకాలు సాధించారన్నారు. వీరితో పాటు 86 కేజీల విభాగంలో ఎస్.కౌశికేశ్వర్ రెడ్డి, 130 కేజీల విభాగంలో జె.వెంకట నవీన్ కాంస్య పతకాలు సాధించడం హర్షనీయమన్నారు. మున్ముందు మరిన్ని పతకాలు సాధించి జాతీయస్థాయిలో జిల్లా ఖ్యాతిని చాటాలన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి జయంతి మహోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యులు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి మహోత్సవాలు మంగళవారం పూర్వపు మఠాధిపతుల కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభ మయ్యాయి. ఉదయం ఆలయ ప్రాంగణంలో యాగశాల ప్రవేశం, కలశాలస్థాపన తదితర ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం స్వామివారికి ఆలయ ప్రాంగణం నుంచి కలశాల గ్రామోత్సవాన్ని నిర్వహించి.. పురవీధుల గుండా మహిళలచే కళశాలు ఊరేగింపుగా తీసుకెళ్లి వీరబ్రహ్మేంద్రపార్కులో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫిట్‌పర్సన్ శంకర బాలాజీ, మేనేజరు ఈశ్వరాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గండి క్షేత్రంలో ప్రారంభమైన పవిత్రోత్సవాలు



చక్రాయపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండిలో పవిత్రోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యా యి. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, విశ్వక్షేణ ఆరాధన, వాసుదేవ పుణ్యాఃవాచనం, రక్షాబంధనధారణ, వాస్తు హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పారదర్శకంగా సాగుతున్న ఆర్మీ ఎంపికలు





అభ్యర్థుల ఆన్‌లైన్ ప్రక్రియ, రన్నింగ్‌కు ఉపక్రమిస్తున్న అభ్యర్థులు

కడప స్పోర్ట్స్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ స్టేడియంలో గత మూడు రోజులుగా జరుగుతున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా సాగుతోంది. సైనికుడిగా మాతృదేశ సేవలో తరించేందుకు అనువైన పరుగు పందెంతో పాటు ఇతర విభాగాలలో సైతం రాణించేందుకు జవసత్వాలను కూడగట్టుకొని మరీ అభ్యర్థులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా మైదానంలోకి ఇతరులు ఎవ్వరినీ అనుమతించకుండా, కేవలం అభ్యర్థులను మాత్రమే అనుమతిస్తూ.. ఆర్మీ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ముందస్తుగా అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టి తదుపరి మైదానంలో రన్నింగ్, హైజంప్, లాంగ్ జంప్, చినప్స్, జిగ్‌జాగ్ బ్యాలెన్స్, తదితర విభాగలలో పాల్గొనేలా బ్యాచ్‌కు 70 మందిని పంపిస్తున్నారు. కాగా, సజావుగా సాగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి తుఫాన్ అడ్డంకిగా మారనుందా అనే సందేహాలు ఉన్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా రాయలసీమలో వర్షాలు కురుస్తాయనే సంకేతాలున్న దృష్ట్యా అధికారుల్లో ఆందోళన నెలకొంది.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆసుపత్రులు, క్లినిక్స్, ల్యాబ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య హెచ్చరించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు లేకుండా అస్పత్రులు నిర్వహించినా క్లినిక్‌లు నడిపినా, ల్యాబ్‌లు ఏర్పాటు చేసినా ఆకస్మిక తనిఖీలు నిర్వహించడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లలో ఫైర్ డిపార్టుమెంట్ అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. క్లినిక్స్, ల్యాబ్స్, డయాగ్నెటిక్ సెంటర్స్ ఫిజియోథెరపీ క్లినిక్‌లు, ప్రైవేటు హాస్పిటల్స్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు వాటికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ను కూడా జతపరచాలన్నారు. మున్సిపల్ నుంచి ట్రేడ్ లైసెన్స్, బిల్డింగ్ ప్లాన్ సర్టిఫికెట్స్ జత చేయాలని, ఆసుపత్రులు ఏర్పాటు చేసిన ఏరియా ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే ఆసుపత్రి ఆర్థిక పరిస్థితి వివరాలను తెలిపే ఆడిట్ రిపోర్టును పొందుపర్చాలని, నిర్దేశించిన నిబంధనలను పాటిస్తానని రూ.50ల స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్ పొందుపర్చాలన్నారు. బెడ్స్ ఉన్న ప్రతి హాస్పిటల్‌కి ఫైర్ ఎన్‌వోసీ, కాలుష్య నియంత్రణ బోర్డు నుంచి పొల్యూషన్, బయో మెడికల్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి హాస్పిటల్‌తో పాటు డయాగ్నస్టిక్ సెంటర్లలో ఏ పరీక్షకు ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ధరల పట్టికను నోటీస్ బోర్డులో ప్రకటించాలన్నారు.

కువైత్‌లో రోడ్డు ప్రమాదం బద్వేలు వాసి మృతి

బద్వేలుటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణం లోని చాకలివీధికి చెందిన షేక్‌మౌలాలి(55) కువైత్‌లో శుక్ర వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మౌలాలి గత కొన్ని సంవత్స రాలుగా కువైత్‌లో టైలర్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కువైత్‌లో ఓ పని నిమిత్తం బస్సులో వెళుతుండగా.. బస్సు ప్రమాదానికి గురికావడంతో మౌళాలి అక్కడిక్కడే మృతి చెందాడు. అక్కడి స్నేహితుల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక్క కుమారుడు ఉన్నారు. కాగా మంగళవారం మృతదేహానికి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మహిళ ఆత్మహత్య

ఎర్రగుంట్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎర్ర గుంట్ల-ముద్ద నూరు రోడ్డులో నివాసం ఉంటున్న కల్లూరు శైలజ (32) మంగళ వారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కంచన్నగారిపల్లెకు చెందిన వీరారెడ్డితో శైలజకు ఆరు సంవ త్సరాల క్రితం వివాహమైంది. రెండేళ్లుగా అనారోగ్య సమస్యలు ఉండటంతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నా ఆరోగ్యం నయం కాలేదు. దీంతో ఆమె మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంక పోరంబోకులో..రాత్రికి రాత్రే అక్రమ కట్టడాలు

- ఉదయం వచ్చి కూల్చేసిన అధికారులు
- అధికారులకు, ఆక్రమణదారులకు మధ్య వాగ్వాదం



గంగరాజుపురం ప్రధానదారి పక్కనే అక్రమ నిర్మాణాన్ని కూలదోస్తున్న అధికార సిబ్బంది

రైల్వేకోడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరాజపురం పంచాయతీ గంగరాజపురం గ్రామం సర్వే నెంబరు 178లోని 2.3 ఎకరాల వంక పోరంబోకు విస్తీర్ణంలో సోమవారం రాత్రికి రాత్రే కొందరు పునాదులు తీసి ఏకంగా షెడ్డు నిర్మాణం చేపట్టారు. విషయం తెలిసి మంగళవారం ఉదయం రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖాధికారులు రంగంలోకి దిగి పనులు నిలుపుదల చేయించి ఆక్రమణలు కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజల మధ్య వాగ్వాగం చోటు చేసుకుంది. రైల్వేకోడూరు తహశీల్దార్ మహబూబ్ చాంద్, వీఆర్వో సుజని తమ సిబ్బందితో ఆక్రమణలను తొలగించి బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఆక్రమణ చేసిన స్థలం పూర్తిగా వంకపోరంబోకు అని తెలిపారు. ఈ స్థలాన్ని ఎవరూ ఆక్రమించరాదని తెలిపారు. అలా ఆక్రమించడానికి చూస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2.3 ఎకరాలు పూర్తిగా వంక పోరంబోకు స్థలం అని తెలిపారు. షెడ్డు నిర్మాణం పక్కనే కొందరు వ్యక్తులు నిర్మాణాలు చేయడానికి గుంతలు తీసి ఉండడాన్ని గుర్తించి వాటిని కూడా పూడ్చివేశామన్నారు. ఎవరు ఆక్రమించినా వదిలే ప్రసక్తి లేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వంక పోరంబోకు స్థలాలు, ఏటి పోరంబోకు స్థలాలు ఎవరూ ఆక్రమించరాదని తెలిపారు. ప్రభుత్వ స్థలాలపై రెవెన్యూశాఖ కన్నువేసి ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బందిపై దౌర్జన్యం చేస్తే మాత్రం కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణదారులపై ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్వో సుజని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ కే.హేమసుందరరావు తెలిపారు. రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్‌బాబు, ఆర్ఐ లక్ష్మీదేవి, సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ ఏఈ మధుసూధన్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ విజయలక్ష్మిదేవికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డును స్వీకరిస్తున్న విజయలక్ష్మిదేవి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) :ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ విజయలక్ష్మీదేవి రాష్ట్రఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా స్వీకరించారు. ఈ నేపథ్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీం బాషా హర్షం వ్యక్తం చేశారు.

కిలో టమోటా ధర రూ.25

గుర్రంకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మార్కెట్‌లో మంగళవారం కిలో టమోటా ధర రూ.25లు పలికింది. గత ఇరవై రోజులుగా టమోటా ధరలు రోజు రోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. బయట రాష్ట్రాల్లో టమోటాల దిగుబడి ప్రారంభం కావడంతో ధరలు తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. అంతేకాకుండా వర్షాలకు కాయల నాణ్యత లేకపోవడంతో ధరలు తగ్గినట్లు వ్యాపారులు తెలుపుతున్నారు. ఈ లెక్కన కిలో టమోటా ధర రూ.25 పలికింది. దీంతో 25 కిలోల టమో టా క్రేట్ ధర రూ.625 పలికింది. టమోటా ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆం దోళన చెందుతున్నారు.

ఇళ్లు పూర్తికాకపోతే బిల్లులు రావు

కలికిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం కేటాయించిన కాలనీల్లో గృహ నిర్మాణాలను తొందరగా పూర్తి చేయకపోతే మార్చి తరువాత బిల్లులు వచ్చే అవకాశం ఉండదని ఎంపీడీవో భానుమూర్తి రావు పేర్కొన్నారు. మంగళవారం కె.రెడ్డివారిపల్లె కాలనీలకు సంబంధించిన లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన అన్ని రకాల సహకారాలను అధికారులు అంద జేసేందుకు సిద్ధంగా ఉన్నారని హామీ ఇచ్చారు. రుణ సహాయం అవసరమైన వారికి వెలుగు అధికారులు ఏర్పాటు చేస్తారని చెప్పారు. సకాలంలో ఇళ్ళు పూర్తి చేయకపోతే పట్టాలు కూడా రద్దయ్యే ప్రమాదముందని ఎంపీడీవో వివరించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, వెలుగు ఏపీఎం దేవయాని, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

19న మదనపల్లెలో ఎక్సైజ్ వస్తువుల వేలం

మదనపల్లె టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో ఉన్న ఎక్సైజ్ వస్తువులను ఈనెల 19వ తేదీన వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 65 ఫ్రీజర్లు, 67 ఇన్వ ర్టర్, బ్యాటరీలు, 75 క్యాష్‌చెస్ట్‌లు, 152 క్యాష్ కౌంటింగ్‌మిషన్లు, స్కానర్లు ఉన్నాయని, వాటికి బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 19వ తేది ఉదయం 10గంటలకు ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు స్టోర్ ఆఫీసర్ 9701777938 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

రోప్ స్కిప్పింగ్ పోటీలలో విద్యార్థిని ప్రతిభ



వెండిపతకం అందుకుంటున్న విద్యార్థిని దివ్యశ్రీ

వాల్మీకిపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని దివ్యశ్రీ వెండి పతకం కైవసం చేసుకుంది. ఇటీవల వెస్ట్ గోదావరి జిల్లా భీమవరంలో జరిగిన అంతర్ జిల్లాల క్రీడా పోటీలలో రోప్ స్కిప్పింగ్ పోటీలలో వాల్మీకిపురం విద్యార్థిని దివ్యశ్రీ విశేష ప్రతిభ కనబరచి రెండో స్థానంలో నిలవడమే కాకుండా వెండి పతకం సొంతం చేసుకుని ప్రశంసలు పొందింది. స్టేట్ స్పోర్ట్స్ సెక్రటరీ మల్లేశ్వర్ ద్వారా బహుమతి, ప్రశంసాపత్రాలు అందుకుంది. ఈ సందర్భంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సబీహా అంజూమ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు దివ్యశ్రీని అభినదించారు.

బాధ్యతగా 'మీ-సేవ'లు అందించండి



పులికల్లు సచివాలయంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎల్‌డీవో అమరనాథ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీడీవో, ఈవోఆర్డీ

పెద్దతిప్పసముద్రం నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) :ప్రజలకు మీ-సేవ కేంద్రాల ద్వారా వివిధ రకాల సేవలను ఎలాంటి అసౌకర్యం లేకుండా బాధ్యతగా అందేలా కేంద్రాల నిర్వాహకులు చూడాలని డీఎల్‌డీవో అమరనాథరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఎంపీడీవో అబ్దుల్ కలాం అజాద్, ఈవోఆర్డీ యోగానంద్‌లతో కలిసి పులికల్లు మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పులికల్లు గ్రామంలో కాకుండా బి.కొత్తకోటలో మీ సేవ కేంద్రాన్ని నిర్వహిస్తుండడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. మీ సేవ కేంద్రాల్లో ఎలాంటి పొరపాట్లు జరిగినా సహించేది లేదంటూ, అలాంటి కేంద్రాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. మీ సేవ కేంద్రాల్లో లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా అటువంటి సెంటర్లపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మీ సేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తే సహించేది లేదన్నారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. అనంతరం కాట్నగల్లు సచివాలయాన్ని పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ఇంటింటి సర్వే చేయడంతోపాటు ప్రతి ఇంటిని మాఫింగ్ చేసి వారికి కేటాయించిన ఇళ్లను పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా అపార్ కార్డులకు సంబంధించి జనన ధృవీకరణ కోసం విద్యార్థులను సచివాలయాల చుట్టూ తిప్పు కోకుండా వారికి అందుబాటులో ఉండి అపార్‌కు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

- బి.కొత్తకోటలో ఆక్రమణలపై కొరడా..
- స్వచ్ఛందంగా తొలగించాలంటూ కమిషనర్ సూచన



బి.కొత్తకోటలో ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

బి.కొత్తకోట, నవంబరు(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలో ఆక్రమణల తొలగింపునకు మున్సిపల్ అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. నగరపంచాయతీ కమిషనర్ జీఆర్ పల్లవి, పట్టణ సీఐ రాజారెడ్డి పోలీసు సిబ్బందితో పీటీయం రోడ్డు, బెంగళూరురోడ్డు, రంగసముద్రం రోడ్డులతో పాటు, జ్యోతిసర్కిల్‌లో ఆక్రమణలు గా భావించిన కొన్నింటిని తొలగించారు. మిగతా వారికి 24 గంటల్లో ఆక్రమణలు తొలగించుకోవాలని సమయమిచ్చారు. గడువులోగా స్వచ్ఛందంగా తొలగించక పోతే ప్రొక్లైనర్‌తో తొలగిస్తామని హెచ్చరించారు. పట్టణంలోని జ్యోతిచౌక్ నుంచి రం గసముద్రం రోడ్డు, బెంగళూరు రోడ్డు, పీటీయం రోడ్డు లలో దుకాణదారులు తమకు వీలున్న మేరకు మున్సిపల్ డ్రైనేజినిదాటి ఆక్రమణలు జరిగాయి. జ్యోతి సర్కిల్‌లో ఉన్న పురాతన వాటర్‌ట్యాంకు చుట్టుపక్కల, బస్‌షెల్టర్ ఎదుట, బావిలోగంగమ్మ ఒడ్డున స్థలాన్ని ఆక్రమించి పూల అంగళ్లు ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ ఆనుకొని బంకులను ఏర్పాటుచేసి అద్దెలకు ఇచ్చుకున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా, ఎన్నిసార్లు ఫిర్యాదులు వచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. అయితే మంగళవారం కమిషనర్ రంగంలోకి దిగి ఆక్రమణలకు శ్రీకారం చుట్టడంతో ఆక్రమణదారుల్లో లజడి మొదలైంది. ఎంతోకాలం నుంచి ఆక్రమించుకొని అనుభవిస్తున్న వారు ఆందోళనకు గురికాగా, ఈ ఆక్రమణలు ఎప్పుడు తొలగిపోతాయా? బస్టాండు కు మోక్షం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్న ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామసభలో 160 అర్జీల స్వీకరణ

పెద్దతిప్పసముద్రం నవంబర్ 12(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలో రీసర్వేలో రెవెన్యూ అధికారులకు వివిధ సమస్యలపై 160 అర్జీలు అందాయి. మంగళవారం స్థానిక సచివాలయ వద్ద రీసర్వేలో వచ్చిన భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభల ద్వారా పలువురు రైతులు తమకు భూసర్వే ద్వారా పలు తప్పులు దొర్లాయని కోరుతూ వాటిని తక్షణం పరిష్కరించాలని అర్జీలను అందజేశారు. అర్జీలు వచ్చిన వాటిలో విస్తీర్ణం సవరణ, జాయింట్ పీల్డ్ డివిజన్, జాయింట్ పీల్డ్ ముటేషన్, ముటేషన్ సవరణ, కోరిలేషన్ సవరణ, ఫొటో, మొబైల్ నంబర్ అప్‌డేట్, పట్టాదారు సవరణ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీల రూపంలో అందజేశారు. కార్య క్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధనంజయులు, స్థానిక వీఆర్వో లలితకుమారి, మండల సర్వేయర్ శ్రీవాణి, లతో పాటు గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె అర్బన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి):ఆశావర్కర్లకు సంబంధంలేని పనులు చేయించడమే కాకుండా వారిపై వేధింపులకు పాల్పడుతున్న సీటీఎం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీ లక్ష్మీ, సీహెచ్‌వో అరుణ, సూపర్‌వైజర్ సుమతిలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు , ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సీటీఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాకార్యకర్తలకు రోజువారీ ఓపీ విభాగంలో డ్యూటీలు వేయడం, వారికి సంబంధంలేని పనులు చేయించడం, వేధింపులకు పాల్పడటం, లాంటి చర్యలకు నిరసనగా మంగళవారం పీహెచ్‌సీ ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా చేశారు. ఓపీ డ్యూటీలు రద్దు చేయాలని, వేధింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, వారికి పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆశాలకు న్యాయం చేయకపోతే పోరాటం ఉదృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రామామణి, గాయిత్రి, ప్రసన్న, రమాదేవి, అమరావతి, పార్వతీ, బాలకుమారి, జానకి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

పంటలలో అధిక దిగుబడులు సాధించాలి

పెద్దమండ్యం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : పంటలలో అధిక దిగుబడులు సాధించడానికి రైతులు వ్యవసాయంలో అధునాతన పద్ధతులను అవలంభించాలని జేడీఏ చంద్రానాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ముసలికుంట గ్రామ పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి వేరుశనగలో తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులు సాధన తదితర అంశాలను వివరించారు. రైతులకు పలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో సురేష్ బాబు, రైతు సేవా కేంద్రం సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

కురబలకోట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అధైర్యపడకండి...మీకు అండగా ఉంటామని ఎంఈవో ద్వారకనాథ్, టీడీపీ నేత జంగా రాఘవరెడ్డి మంగళవారం పేర్కొన్నారు.. మండలంలోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులపై సైకోగా మారిన మతిస్థిమితం లేని వ్యక్తి దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. కాగా పాఠశాలలో విద్యార్థులను వారు పరామర్శించి ధైర్యం చెప్పారు. పాఠశాలలో మరుగుదొడ్లు లేక పోవడం వల్ల బయటకు వెళ్ళారని, కావున మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.5వేలు వితరణ చేశారు

విద్యుదాఘాతంతో కార్పెంటర్‌కు గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) విద్యుత్ షాక్‌తగిలి చెన్నకేశవ(30) అనే కార్పంటర్ గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు నిమ్మనపల్లె మండలం, రాచవేటివారిపల్లె, గొల్లపల్లెకు చెందిన చెన్నకేశవ మంగళవారం మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లె సమీపంలోని ముస్లిపప్పకాలనీలో బషీర్ అనే వ్యక్తి ఇంటికి కార్పంటర్ పని చేస్తుండగా ఇంటి ముందు నుంచి వెళుతున్న కరెంటు తీగలు తగిలి బాధితుడి శరీరం, కాళ్ల కాలి గాయాలయ్యాయి, వెంటనే గమనించిన స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం తిరుపతికి తరలించారు. టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భార్య దాడిలో భర్తకు గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): భార్య దాడిలో ఓ భర్త గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. భార్యాభర్తలైన సునీత, చైతన్యల మధ్య గొడవల కారణంగా మంగళవారం తాలుకా పోలీసు స్టేషన్‌కు ఇరువురు ఫిర్యాదు చేయడానికి రావడవత మదనపల్లె వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా ఒకరి జోలికి మరొకరు వెళ్లకుండా ఉండాలని ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చి బుధవారం ఉదయం పోలీసుస్టేషన్‌కు వస్తే వివ రంగా మాట్లాడుతానని పంపించివేశారు. అయితే పోలీసుస్టేషన్ దాటకనే భార్య సునీతా తన భర్తఅయిన చైతన్య(44) ముఖంపై కొట్టింది. దీంతో గాయపడిన చైతన్య జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొంది తిరిగి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి తన భార్య సునీతాపై ఫిర్యాదు చేశారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కురబలకోట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విషం తాగి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు పీలేరు మండలం గ్యారంపల్లెకు చెందిన రమణ అతని భార్య నాగేశ్వరి కురబలకోట మండలం అంగళ్ళు పంచాయతీ చేనేత నగర్‌లో మగ్గాలు నేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఇంటిలోని చెత్తకుండీలో వేసిన చెత్తను ఎత్తలేదని భర్త భార్యను మందలించడంతో మనస్తాపం చెంది ఇంట్లో దాచిన విషం తాగింది. గమనించిన కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యుల సలహా మేరకు తిరుపతికి తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో సెక్యూరిటీపై విద్యార్థుల దాడి

కురబలకోట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్ళు సమీపంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో సెక్యూరిటీ సిబ్బందిపై విద్యార్థులు దాడి చేసిన ఆలస్యంగా వెలుగు చూసింది. కళాశాలలో సెక్యూరిటీ ఆఫీసర్‌గా పని చేస్తున్న శ్రీకాంత్‌పై కొంతమంది విద్యార్థులు దాడి చేశారు. కాగా దీనికి సంబంధించి కళాశాలల సీసీ కెమెరాల్లో రికార్డైంది. ఈ వీడియోలు సోషల్ నెట్‌వర్క్‌లో వైరల్‌గా మారడంతో విషయం వెలుగు చూసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్ కార్డు ఎన్‌రోల్‌మెంట్ చేయాలి

మదనపల్లె అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల ఎన్‌రోల్‌మెంట్ వెంటనే చేయాలని తహసీల్దార్ ఖాజాబీ సిబ్బందికి సూచించారు. మంగళవారం మదనపల్లెకు సంబం ధించి 27 కొత్తరేషన్ కార్డులకు అనుమతి ఇచ్చిందని లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు వేయించి ఎంటర్ చేయాలన్నారు. పట్టణ, మండలలోని సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. సీఎస్‌డీటీ రెడ్డెప్ప, వీఆర్వోలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సహ అధ్యక్షురాలిగా హేమలత

రామసముద్రం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా యూటీఎఫ్ సహ అధ్యక్షురాలిగా రామసముద్రం తూర్పు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర యూటీఎఫ్ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు తెలిపారు. మదనపల్లెలో మంగళవారం జరిగిన యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు చెప్పారు. గతంలో హే మలత యూటీఎఫ్ మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో అనేక కీలక పదవులను అధిష్ఠించారన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర స్థాయిలో ఈమెకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ముఖ్యంగా మహిళా టీచర్ల సమస్యలపై హేమలత పలుసార్లు ఉద్యమించారన్నారు. హేమలత నియామకం పట్ల యూటీఎఫ్ రాష్ట్ర స్థాయి కార్యవర్గం హర్షం వ్యక్తం చేశారు.

చిత్రం చెప్పిన సమస్య



వాల్మీకిపురం పట్టణంలోని గ్రామసచివాలయం అరణ్యాన్ని తలపించేలా ఉన్న ముళ్లపొదల మధ్య దర్శనమిస్తోంది. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు నాల్గవ వార్డు సచివాలయానికి రావాలంటే భయపడుతున్నారు. మహిళల పరిస్థితి చెప్పడానికి వీలులేదు. అసలు ఈ సచివాలయం ఎక్కడ ఉందో చాలా మందికి తెలియదు. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. -వాల్మీకిపురం, (ఆంధ్రజ్యోతి)

100శాతం సబ్సిడీతో మినీగోకులం షెడ్లు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధి ఏపీడీ మధుబాబు

మదనపల్లె టౌన్/ములకలచెరువు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు 100శాతం సబ్సిడీతో మినీ గోకులం షెడ్లు మంజూరు చేస్తోందని ఉపాధిహామీ తం బళ్లపల్లె క్లస్టర్ ఏపీడీ మధుబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో మదనపల్లె, పెద్దమండ్యం, కుర బలకోట మండలాలకు చెందిన రైతులు, ఉపాధిహామీ సిబ్బం దితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ తంబళ్లపల్లె క్లస్టర్‌లోని కరువు మండలాలకు ఒక్కోదానికి 50 మినీ గోకులం షెడ్లు, మిగిలిన మండలాలకు 20 చొప్పున మినీ గోకులం షెడ్లు మంజూరయ్యా యన్నారు. ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్ల ఆవాసాలకు ఈ షెడ్లు ఐదు రకాలు నిర్మించుకోవాలన్నారు. రెండు ఆవులకైతే రూ.1.25లక్షలు, నాలుగు అవులకైతే రూ.185లక్షలు, 6ఆవులకైతే రూ.2.30లక్షలతో షెడ్లు నిర్మించాలన్నారు. గొర్రెలు, మేకలకు రూ.2.30లక్షలు, కోళ్ల షెడ్లకు అయితే రూ.1.32లక్షలు మం జూరు చేస్తామన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కల్పించిన హక్కు అని, రైతులు ఎవ్వరు ఉపాధిహామీ సిబ్బం దికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో సీఎల్‌ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ చందన, ఏపీవో సుబ్రమణ్యం, వెంకటేష్, టెక్నికల్ అసిస్టెంట్ బావాజి, రైతులు పాల్గొన్నారు. గోకులం షెడ్ల నిర్మాణంలో నాణ్యత ఖచ్చితంగా పాటించాలని డ్వామా ఏపీడీ మధుబాబు సూచించారు. ములకలచెరువు సీఎల్‌ఆర్‌సీ భవనంలో మంగళవారం గోకులం షెడ్లు మంజూరైన లబ్ధిదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా 280 గోకులం షెడ్లు మంజూరయ్యాయన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ విజయం



రాయల్ చాలెంజర్స్ క్రీడాకారులను అభినందిస్తున్న విజయభారతీ హైస్కూల్ ప్రిన్సిపాల్ సేతు

మదనపల్లె అర్బన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): విజయభారతీ విద్యాసంస్థల వైస్ ప్రిన్సిపాల్ నిశ్చిత సేత ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ విజయం సాధించింది. ఈ క్రికెట్ లీగ్‌లో ఎనిమిది జట్లు పాల్గొనగా వారికి నాలుగు లీగు మ్యాచ్‌లు నిర్వహించారు. అనంతరం ఫైనల్‌కు చేరిన వీబీ సూపర్‌కింగ్స్‌తో రాయల్ చాలెంజర్స్ తలపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో నిర్ణీత 5 ఓవర్లు ఆట ముగిసే సమయానికి తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 46 పరుగులు సాధించింది. లక్ష్య చేధనకు దిగిన వీబీ సూపర్ కింగ్స్ బ్యాట్స్‌మెన్ దూకుడుగా ఆడి తమ జట్టు విజయతీరాలకు చేరే సమయంలో చివరి రెండు ఓవర్లలో బౌలర్లు ఉత్తమ ప్రదర్శనతో వరుస వికెట్లు పడగొట్టి పరుగులను కట్టడి చేశారు. ఒకానొక దశలో వీబీ సూపర్‌కింగ్స్ గెలుస్తోందనే ఉత్కంఠ పరిస్థితి నెలకొంది. రాయల్ చాలెంజర్స్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో మ్యాచ్ తనవైపు తిప్పుకున్నారు. దీంతో నిర్ణీత5 ఓవర్లు ముగిసే సమయానికి వీబీ సూపర్ కింగ్స్ 41 పరుగుల తీశారు. దీంతో రాయల్ చాలెంజర్స్ విజయం సాధించింది. విన్నర్స్‌కు ముఖ్య అతిథులుగా విచ్చేసిన బీజేపీ జాతీయ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి, విజయభారతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్ సేతూ విజేతలకు కప్‌ను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు రోజుల్లో మరింత మెరుగ్గా క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండి ఆనంద్, నరేంద్రకుమార్, గుడ్‌విల్ అజయ్, రాయలసీమ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆటవస్తువుల వితరణ



పీడీ రమేశ్‌కు ఆటవస్తువులను వితరణగా అందిస్తున్న వాసవీ ఉమెన్స్‌క్లబ్ సభ్యులు

మదనపల్లె టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఆర్యవైశ్య వాసవీ ఉమెన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు రూ.10వేల విలువ చేసే క్రీడావస్తువులను వితరణగా అందజేశారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య హాస్టల్‌లో వాస వీ ఉమెన్స్ క్లబ్ సభ్యులు గుర్రంకొండ జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు క్రీడావస్తువులను అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు అనూరాధ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రేఖ, కోశాధికారి పూర్ణిమ, సభ్యులు మైత్రి, చాందిని, అన్నపూర్ణ, రమ్య, లత, జడ్పీ హైస్కూల్ పీడీ రమేశ్, ఉపాధ్యాయుడు హర్షవ ర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న రిసోర్సుపర్సన్ తస్లీమ్ కౌసర్

కురబలకోట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలను పొందవచ్చని రిసోర్సుపర్సన్ తస్లీమ్ కౌసర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐ విభాగం ఆధ్వ ర్యంలో అన్‌లాకింగ్ గ్రోత్ స్మార్ట్ మార్కెటింగ్ ఎంపరింగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిసోర్సుపర్సన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ పెరుగుతుందని, దీనిపై దృష్టి సారించి పట్టు సాధించాలన్నారు అంతేకాకుండా విద్యార్థులకు దోహదపడేలా కొత్త టెక్నాలజీలపై పరిశోధనలు చేపట్టి విజయం సాధించాలన్నారు. పరిశ్రమలస్థాపనతో పాటు వ్యాపార రంగంలో విజయాలు సాధించడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్ర మంలో కృష్ణాహూనమ్ సాహా, అఖిలేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీపీడీతో ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యం

పీలేరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీచర్ ప్రొఫిషియన్సీ డెవలప్‌మెంట్(టీపీడీ) కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యాల అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ అభ్యసన పరివర్తన సహాయ పథకం(సాల్ట్) అన్నమయ్య జిల్లా కో-ఆర్డినేటర్ చిన్నబ్రహ్మయ్య పేర్కొన్నారు. పీలేరు ఎంఆర్‌సీలో మంగళవారం ఆయన సాల్ట్ పథకంలో భాగమైన టీపీడీ, ఫిర్కీ యాప్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల నైపుణ్యాలను అభివృద్ధి చేసి తద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సహకారంతో 'సాల్ట్' కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ఆ కార్యక్రమంలో అంతర్భాగమైన అనేక అంశాలను క్షుణ్ణంగా నేర్చుకున్నట్టైతే ఉపాధ్యాయులకు బోధనపై పట్టు పెరుగుతుందన్నారు. అనంతరం ఆయన ఫిర్కీ యాప్‌లోని వివిధ అంశాల గురించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు లోకేశ్వర రెడ్డి, పద్మావతమ్మ, సీఆర్‌పీలు మురళీధర్ రాజు, నాగరాజ, అశోక్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు పెద్ద పీట

కలికిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఏడాది బడ్జెట్‌లో బీసీలకు పెద్ద పీట వేసి గొప్ప మనసు చాటుకుందని టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర జంగం సంఘం ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్ కొనియాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి, బీసీలకు ఉన్న పరస్పర అనుబంధాన్ని ఈ బడ్జెట్ ప్రతిఫలించిందని చెప్పారు. బీసీలపై టీడీపీకి వున్న ఆదరాభిమానాలు ఇప్పటికీ చెక్కు చెదరలేదనడానికి ఇది విస్పష్టమైన ఉదాహరణగా ఆయన తెలిపారు. ఏకంగా రూ.39 వేల కోట్లు కేటాయించడంతో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు లభించిన గుర్తింపు చెప్పుకోదగిందని చంద్రశేఖర్ ప్రశంసించారు. అదే విధంగా గతంలో అత్యంత ఆదరణ పొందిన వృత్తి పనుల వారికి పనిముట్లు అందజేసే పథకాన్ని పునరుద్ధరించడం హర్షించదగిన పరిణామంగా పేర్కొన్నారు. టీడీపీకి వెన్నెముకగా ఉన్న బీసీలు కూడా అదే పంథాను టీడీపీ పట్ల అదే పంథాను కొనసాగిస్తారని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి ఆయన బీసీల తరపున కృతజ్ఞతలు తెలిపారు.